## మన మహాత్ముడు!

భరతమాత
దాస్య శృంఖలాలను ఛేదించే
స్వాతంత్ర్య సమర శంఖారావ
సింహ గర్జనా భేరీ నినాద
విరాట్ స్వరూపుడై
ఒకే.. ఒక్కడు..
కోట్ల గొంతుకల గుండెల్లో
ఆరాధ్య స్ఫూర్తి తేజుడై
చిరస్మరణీయుడయ్యాడు!
సత్యభాషణా నిగర్వ స్వరూప
యశోభూషణాంకిత
అహింసా సమరాయుధ
సంగ్రామ దీశక్తికి మారుపేరై
ఒకే.. ఒక్కడు..
ఆదర్శవంత జనాభ్యుద నేతయై
దిగంత పర్యంతం పరివ్యాప్తమై
ప్రభావదీప్తి వెలుగులు విరజిమ్మాడు!
కొల్లాయి గుడ్డను కప్పుకొని
నిరాడంబరత్వ నిండుదనంతో
నేల నాలుగు చెరగులా నడిచి
ఒకే. .ఒక్కడు..
భారత దేశ స్వతంత్ర నవశకానికి
నాందీ వాచకమయ్యాడు!
'క్విట్ ఇండియా' 'దండిమార్చ్' తదితర
పోరాట నిరసన జ్వాలను రగిలించి
భరతఖండ ప్రజలను
సంఘటితాశక్తి స్వరూపులుగా తీర్చిదిద్ది
ఒకే.. ఒక్కడు..
మువ్వన్నెల జెండాను
ప్రపంచ శిఖరాగ్రంపై రెపరెపలాడించి
గర్వంగా తలెత్తుకునేలా చేశాడు!

సమయపాలనా దక్షుడై
సర్వమత ప్రేమ మానస సంకేతమై
మనుషుల్లో మహాత్ముడై
ఒకే.. ఒక్కడు..

మానవ చరిత మకుటాయమాన
'బాపూజీ' మణిరత్న బిరుదాంకితుడై
అందరి జేజేల మన్నలను చూరగొన్నాడు!
ప్రపంచ అహింసామార్గ సిద్ధాంతానికి
'గాంధీ' అనే రెండక్షరాలు
నయనద్వయ భవితవ్య రూపాలై నిలిచాయి!



-వంగర పరమేశ్వరరావు
సెల్: 8143237847

## మళ్ళీ మళ్ళీ

ఇంత నిశ్శబ్దంలోనూ ఎక్కడి నుండో
పూల పుప్పొడి రాలి పలకరిస్తున్న చిరు అలికిడి.

ఎన్ని వెన్నెల చుక్కలు తాగిందో కాని
రాత్రి పూలతోటల మధ్య
తీగల్లేని మాటలమీద చకోరమై నర్తిస్తూ ఊహ.

వెచ్చని తలపులు కప్పుకున్న శిశిరపు శీతల పవనం
నిలువెల్లా మునివేళ్ళతో తడిమి
ఔఊసుల మధుర గానాలు వినిపి0చే వేళ
మాటల పూరెక్కల మెత్తని వానలో తడిసి తడిసి
పచ్చని గరిక మరకతాల్లా మొలకెత్తుతాను
ఉల్కలుగా వెలుగు ద్వీపాల్లా ఉండుండి
రాలిపడే నవ్వులన్నీ ఏరుకు మాలలల్లుకుంటాను

మౌనం నా చుట్టూ దట్టంగా మంచువానై కురిసినప్పుడు
లో లోపలి పొరల్లో దాచుకున్న పాటల పొదిలోంచి
ఒక్కొక్క పుష్పకాన్నీ బయటకు లాగి
గతాన్ని పొదిగిన వెచ్చని కిరణాల రెక్కలమీద పరచుకు
పరిమళ భరిత వనసీమలను చుట్టి వస్తాను

పేరుకు పోయిన మంచు పొరల కింద ముణగదీసుకు
బిక్కు బిక్కు మంటూ ఎదురు చూసే
బక్కచిక్కిన వసంతం కళ్ళకొసల్లో నిలుపుకున్న ప్రాణాలు
వెండి మబ్బులు దాటుకు ఓదార్చే వెలుగు కిరణాల
స్పర్శతో సస్య శ్యామలమైనట్టు
పెదవికొసల నుంచి జారిన తొలిపొద్దు పిలుపుకే
ఒళ్ళు విరుచుకున్న వసంతాన్నవుతాను
నాలో నేను హరిత వనాన్ని ప్రవహిస్తాను
సుతి మెత్తని పాదాలను అరచేతుల్లో మోసే నీ ఉనికి
ప్రతిరోజూ నాకో పునర్జన్మే .



-స్వాతీ శ్రీపాద
8297248988

## ఎడారి యాత్ర

విస్తారంగా పరుచుకున్న
ఇసుక రేణువుల మధ్య
ఒకొక్క అడుగువేస్తూ ప్రయాణిస్తున్నాను....
కాస్తంత నీటి తడైనా దొరుకుతుందేమోనని.
నా కలల కన్నీలన్నీ జారి పడింది అక్కడే.

ప్రయాణమంత లూనీ నదిలా ...
పరుగులు తీస్తుంది.
ఏ సముద్రంలోను కలవడం లేదు.
అంతుచిక్కని రహస్యంలా....
ఎడారిలోని ఇసుకకుప్పల్లో ఇంకిపోతుంది.

ఖర్జూర పండ్లలాంటి తీపిఒకటి తగులుతున్నా
ఏదో తెలియని చేదొకటి వెంటాడుతోంది.
గుండెల్లో మండే బాదలా....
వెచ్చని గాలి వీస్తూ.. ఎదన తాకుతుంది
ఇసుక రాళ్ళ తాకిల్ల శబ్దాలన్నీ
సంగీతంలా మారి....
బతుకు పాటను వినిపిస్తున్నాయి.
అయినా సాగుతుంది ప్రయాణం
ఎడారి దారిన.

బ్రహ్మజెముడు చెట్లే నాకు ఆదర్శం.
ఒల్లును ముళ్ళుగా మలుచుకొని...
ఆశల నీరుని ఆవిరవ్వకుండా ....
నిప్పుల కుంపటిలాంటి ఎండలో
ఎదుగుతున్నాయి.

స్వేదపు చుక్కలు...కన్నీటిబొట్లతో
దాహాన్ని తీర్చుకుంటూ...
ఒంటెలతో సమానంగా పరుగెడుతున్న.
ఇసుక దిబ్బలన్ని ...నను ముందుకు నెట్టి
నాకంటే వేగంగా వెనక్కి వెళ్తున్నాయి.
పట్టుదల ముందు అవి తేలిపోయి.

అక్కడేదో ఒయాసిస్సు నాకోసం చూస్తుంది.
తన హృదయాన్ని తెరుచుకొని.
అక్కడేదో నేను పోగొట్టుకున్న
నా కలల కన్నిలన్నీ కనిపిస్తున్నాయి.
అవి పచ్చని మొక్కలై దర్శనమిస్తున్నాయి.
ఎడారి జీవులకు గొంతును తడుపుతున్నాయి.
చివరకు నా దాహాన్ని కూడా తీరుస్తూ...



-అశోక్ గోనె
9441317361

## అడవి ఆదివాసీ

అడవి+ఆదివాసీఏపేగు బంధం
విల్లు+అంబుఏపోరు బంధం
కొమ్ముల కూర సామ బువ్వ
పోడు మెత్కు బంధం
కొండ వాగు చెలిమె నీళ్ళు
రేల పాట డోలు దెబ్బ
సంస్కృతి బంధం
అడ్డఆకు తవిసి జిగురు పుట్ట తేనె
జీలుగు కల్లు కొండ మామిల్లు
మారేడు నేరేడు వెలగ పరికి పండ్లు
జింక పిల్లలు నెమలి పిట్టలు
చెట్లు పుట్టలు పాములు
అడవి ఆనవాళ్ళు
బత్కు బరి పోరు గురి
ఆదివాసీల అనుబంధాలు
జంతువులు మనుషులు
కలిసి మెలిసి జీవించే
జీవన స్నేహ బంధం
పక్షులకు పలుకులు పాటలు
ఆటలు నేర్పి
వన బడి అడవి
రణ ఒడి ఆదివాసీలు
(09-08-2021ఆదివాసీ
దినోత్సవం సందర్భంగా)



-ఉప్పెన
810607366

## "గొప్ప విదుషీమణి పాకాల"



సాహితీ సౌరభాలద్దుకొని
సామాజిక వైవిధ్యపు ఆనవాళ్ళతో
పరిఢవిల్లిన జ్ఞానసుగంధం
దిగంతాలకు వ్యాప్తి ఆయెను
పాకాల వారి కీర్తి

ఒడిసి పట్టిన భాషా యాసలతో
సాహితీ యాత్ర సాగించి
కవన తీరాన్నీ తాకెను

బాల్యంలో వివక్షకు గురై
అవకాశాలను అందిపుచ్చుకుని
సాటిలేని మేటి ఆదర్శ మహిళగా రాణించెను

మాండలికపు సిరానద్దుకొని
జాతీయాలు నుడికారాలతో
శతాధిక కవితలల్లిన
సాహితీ సేవకురాలు యశోదారెడ్డి

మూడు తరాల సామాజిక ప్రవాహంలో
అవినీతి వాస్తవ స్థితిగతులను
కథలుగా ముచ్చట్ల వాన కురిపించారు

పెనవేసుకున్న పసరం మనిషి బంధాన్ని
వాస్తవిక చిత్రణతో సమాజాన్ని
మేల్కొలిపిన గొప్ప విదుషీమణి

బహుభాషా కోవిధురాలిగా
తెలుగు సాహితీ కిరీటాన్నలంకరించి
వెలుగులు విరజిమ్మిన నారీమణి

పెనిమిటి ప్రోత్సాహంతో
పరిపూర్ణత సాధించి
సాహితీ క్షేత్రంలో
వికసించిన కుసుమ పరిమళం
కీర్తి కిరీటి పాకాల యశోదారెడ్డి



-చైతన్య భారతి పోతుల
7013264464

## నేను

అవును నేను పల్లేరు కాయనే
నీ కాలుకింద నలగ కుండ ఉండ దానికి
నన్ను నేను రక్షించుకోవడానికి
తప్పలేదు మరి
ఒక్కో గాయం ఒక్కోముల్లై పెరిగిందినాలో
అవును నేను ఎడారి మొక్కనే
నిస్సారమైన జీవితంలో
నన్ను నేను బ్రతికించుకుంటాను
అవును నేను తమరాకును
కుళ్ళు కుతంత్రాల సమాజం లో
పెరిగినా మచ్చుకైనా అంటక
విరబూసిన తామరను
నేను వేణువు ను
నిలువెల్ల గాయలున్నా
గేయమై అలరిస్తాను.
మనిషితనం నామతం
మమతల గానం నాస్వరం



-బి.అంజనీ దేవి
9849875082

## సురవరం వారి అపూర్వ రచన 'రామాయణ విశేషములు'

పుస్తక సమీక్ష




రామాయణంపై తెలుగులో ఇంత విపులంగా రాయబడ్డ విమర్శ గ్రంథం ఇంత వరకు వెలువడలేదని చిదిరెమఠం వీరభద్రశర్మ తన ముందు మాటలో రాసారు. రామాయణం క్రీ.పూ. 2500 ఏండ్ల నాటిదా భారతము క్రీ.పూ.1600 సం-- నాటిదా అనే విమర్శనాత్మక దృష్టితో ప్రాక్పశ్చిమ పండితుల గ్రంధాలను ఉదహరిస్తూ నిర్ధారించిన గొప్ప ప్రామాణిక గ్రంథం ఇది. ఈ గ్రంథానికి పీఠిక చక్కగా చెప్పారు. అలాగే ఈ గ్రంథంలో రామాయణ, మహాభారతములలోని కథా సాదృశ్య ములు చాలా గొప్పగా వివరించారు. (పేజి.31) మరి కూర్చు పీఠికలో గ్రంథ ప్రాముఖ్యం చెప్పారు అనుమల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి. 270 పేజీల్లో.. 11 భాగాల్లో రామాయణ కావ్యాన్ని విశ్లేషించారు. ఇలియడ్, హొమరు, పురాణగాధల్ని పోల్చిరాయడం బాగుంది ఆనాటి కాలంలోగల సాంఘిక ఆచారములు, వర్గ వ్యవస్థ, అనార్యులు, నరమేధము, అశ్వ మేధము, మాంస భోజనము, ఇతక పాకములు, స్త్రీల స్థానము, బహుభార్యాత్యములాంటి అంశాల్ని విపులంగా వివరించారు ఈ గ్రంథంలో. బౌద్ధ జాతక రామకథ (పేజి.70), కథా పరిత్యాగరము (పేజి.72) ఋగ్వేదములో రాముడు (పేజి.82). వాల్మీకి కాలం (పేజి.87) రాముని ప్రవాసకాలము (పేజి.111)లాంటి అంశాల్ని పాఠకుల్లో మన పురాణ సంస్కృతిపై ఎంతో అవగాహన కల్పిస్తాయి.

నాస్తికులు- వర్ణవ్యవస్థ- ఆర్యుల సంస్కృతి- ఆకాలంలోని రాజనీతి, పలు పాత్రల విశ్లేషణలు (రాముడు- సీత-కైకేయి- లక్ష్మణుడు- రావణువు - విభీషణుడు) ఆర్యావర్తీ మేది? దిక్కులు? వాటి పరిధి- రాక్షస వర్గములు- వారి నాగరికత - ఇలా ఆనాటి కాల గుమనాల్ని నమెదు చేసిన గొప్ప గ్రంథం సురవరంవారు అందిస్తే అకాడదీ దీన్ని ప్రచురించి పాఠకులకు అందించింది.

**ప్రతులకు:** తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్,
రవీంద్రభారతి ప్రాంగణము
హైదరాబాద.
ఫోన్: 040-29703142



- తంగిరాల చక్రవర్తి
సెల్: 9393804472

## కోతి సాయం

(కథ)

సంతపేట శివారులో రామయ్య నివాసం ఉండేవాడు. అతడు వ్యవసాయదారుడు. అతడికి పక్షులన్నా జంతువులన్నా ఎంతో ఇష్టం. అతడు ఒక కుక్కని, కోడిని పెంచుకున్నాడు. దారి తప్పి వచ్చిన కోతిని కూడా చేరదీసాడు. వాటిని కన్నబిడ్డలకంటే ఎక్కువగా చూసుకునేవాడు. కొన్నాళ్ళకి అవి మంచి స్నేహితులయ్యాయి. జాతి వైరం మరచి కలసిమెలసి ఆడుకునేవి. వాటి ఆట పాటలు చూసి రామయ్య ఎంతో ఆనందించేవాడు. కొన్నిరోజుల తరువాత కోడికి జబ్బు చేసి చనిపోయింది. ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న కోడి దూరం కావడంతో రామయ్య బోరున విలపించాడు.

మిత్రుడు లేక ఆటపాటలు లేక దిగాలుగా ఉండిపోయాయి కుక్కకోతి. ఇంటి దగ్గర సందడిలేక దేనిమీద మనసులగ్నం కాలేదు రామయ్యకి. ఇలా ఉంటే లాభం లేదు అనుకుని ఒకరోజు పట్నానికి పోయి రంగు రంగుల కోడిపిల్లను కొని తెచ్చాడు. చిట్టి చిట్టి రెక్కలతో రంగు రంగుల కోడి పిల్ల ఇంటి చుట్టూ తిరుగుతూ ఉంటే చూసి రామయ్య ఎంతో మురిసిపోయాడు. కోడిపిల్ల ముద్దుముద్దు మాటలకు కుక్క కోతి ముచ్చటపడి స్నేహం చేయడం మొదలు పెట్టాయి. మొదట్లో కాస్త భయంగా అనిపించినా రాను రాను కోతి కుక్కకు దగ్గరయ్యింది కోడి పిల్ల. ఇలా కోడి పిల్లతో ఆడుకుంటూ పాడుకుంటూ ఆనందంగా గడపసాగాయి. రోజూ లాగే రామయ్య పొలం పనికి వెళ్ళిపోయాడు. కోడిపిల్ల ఆడుకుంటూ ఆడుకుంటూ అక్కడే ఉన్న ఖాళీ తొట్టె పైకి ఎక్కింది కాలుజారి తొట్టెలోకి పడిపోయింది. రెక్కలు టప టప మని ఆడిస్తూ "రక్షించండి రక్షించండి" అని గట్టిగా అరచింది. ఎవ్వరూ రాలేదు."అయ్యో ఎవరూ లేరే నేనెలా బయటకి వచ్చేది" అని ఏడవడం మొదలు పెట్టింది కోడిపిల్ల.

చెట్టు పైన ఉన్న కోతి అది చూసి కుక్కకు చెప్పింది. రెండూ పరుగు పరుగున తొట్టెదగ్గరికి చేరుకున్నాయి. ఏమిచెయ్యాలో వాటికి తోచక తొట్టె చుట్టూ తిరగసాగాయి. ఎలాగైనా తమ స్నేహితుడిని రక్షించాలనుకున్నాయి.

"తొట్టె చాలా ఎత్తుగా ఉంది కదా!. మిత్రుడిని ఎలా రక్షించగలము " అని అడిగింది కోతి. ఉపాయం ఉంటే ఎలాంటి అపాయాన్నైనా ఎదుర్కోవచ్చు." అంది కోతి.

'అదేంటో తొందరగా చెప్పు" అంది కోతి గాబరాపడుతూ...

' నువ్వు నా వీపుపై కూర్చో నేను తొట్టె అంచున నిలబడి ఉంటాను. నువ్వు జాగ్రత్తగా కోడిపిల్లని పట్టుకుని బయటకు లాగు " అంది కుక్క.

'ఓ! అలాగే " అని కుక్క వీపుపై కోతి కూర్చుంది. కుక్క తొట్టె పక్కకి వెళ్లి నిలబడింది. కోతి తొట్టె అంచున జాగ్రత్తగా కూర్చుని లోపలికి వంగి కోడిపిల్లని పట్టుకోడానికి ప్రయత్నించింది. అప్పటికే బాగా అరచి అరచి అలసిపోయి ఉందేమో దొరికినట్లే దొరికి చేతిలోంచి జారిపోయేది కోడిపిల్ల. అయినా పట్టు వదలక ప్రయత్నిస్తూనే ఉంది కోతి. కొంతసేపటికి కోతి చేతికి చిక్కింది కోడిపిల్ల. ఒడుపుగా దానిని పట్టుకుని తొట్టెలోంచి బయటకు పడేసింది. కాసేపటికి కోడిపిల్ల తేరుకుని. "మీరు రక్షించక పోతే ఆ తొట్టెలోనే ఉండిపోయేదాన్ని" అని మిత్రులకు ధన్యవాదాలు తెలియచేసింది. ఆపదలో ఆదుకున్నవాడే నిజమైన మిత్రుడు అని కుక్క, కోతి,కోడిపిల్లని దగ్గరకు తీసుకున్నాయి.



-కాశీవిశ్వనాధం
పత్రాయుడు
9494524445

## నాన్న

వాడు "అమ్మా" అన్నా వాడి తెలీదు
అమ్మలో నాన్నున్నాడని
"నాన్న" అన్నా వాడికి తెలీదు
"నాన్నా"లో అమ్మవుందని
"నాన్న" యెప్పుడూ వుంటాడు
ఒకప్పుడు యెదురుగా
ఒకప్పుడు "ఆత్మ"గా
"నాన్న" నీవెంటుండే "నీడ"
"నాన్న" నీ శక్తి, యుక్తి
నీ దేహమంతా "నాన్నే"
అందుకే "పితృదేవోభవ"
అందుకే "నాన్న" ప్రియుడు, ఆత్మబంధువు
"నాన్న" ఓ మనిషి ఓ ఋషి
అందుకే "నాన్న" మాట కఠినం,
మనస్సు వెన్న ఆకాశమంత యెత్తు
ప్రకృతంత గొప్ప వెరసి "నాన్న"
అన్నిటికన్నా మిన్న ఓ ఆదర్శం
"నాన్న" యెప్పుడూ గొప్పే
యుప్పుడూ గొప్పే.



- సత్యం
సెల్: 9100495714

## జగతి-ప్రగతి

పిల్లల్లారా...బాలల్లారా
చిటపట కురిసే చినుకుల్లారాత

గువ్వల్లారా...మువ్వల్లారా
కిలకిల నవ్వే పువ్వుల్లారా

కూనల్లారా...కోయిల్లారా
గలగల పారే సెలయేరుల్లారా

మల్లెల్లారా...మైనల్లారా
జలజల రాలే జల్లుల్లారా

తారల్లారా...జాబిలిలారా
జరజర పారే వాగుల్లారా

ముత్యాల్లారా...మురిపాల్లారా
ధగధగ మెరిసే వజ్రాల్లారా

వెన్నలారా...వెన్నెల్లారా
తళతళ మెరిసే రత్నాల్లారా

మీదే మీదే రేపటి జగతి
మీతోనే ఆరంభం నూతన ప్రగతి



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## 'అమ్మ'కపు బొమ్మగా...

ఆమె
తన రక్తాన్ని స్తన్యంగా మార్చి
అమృతధారలతో
అమ్మగా
అడ్డాలనాడు
శిశువు కడుపు నింపి
ఆకలి తీర్చింది

గడ్డాలనాడు
మగాడయ్యాక
పశువుగా మారిన
వాడి స్వార్థం
అమ్మతనాన్ని మరచి
జేబులు నింపుకునే
కాసుల కక్కుర్తితో
ఆమెకు
వలవలు ఊడ్చి
వ్యవస్థను చేసి
నడి బజారుపై
విలువలు లేని విపణిలో
'అమ్మ'కపు బొమ్మగా మార్చింది



-రజిత కొండసాని
9652838920

## బాల్యం

చిన్ననాటి బాల్యమంతా..
చిత్ర విచిత్రంగా గడిచెను..
చిమ్మ చీకట్లు అలుముకొని..
చీదరింపులకు గురాయెను..

కడుపునిండా తిండిదొరుకక.
కాలేకడుపుతో నిదురోతిని..
కాళ్ళు చేతులు గుంజుకచ్చి..
కంటి మీద కునుకేయకుంటిని..

వయసుకు మించిన పనులనెన్నో..
బాల్యమందునా చేసితిని..

వయస్సు పైన బడుతుంటే..
చేతకాక మిగిలిపోతుంటిని..

పేదవాడిగా పుట్టినందుకు..
బాధలేమో తీరకపోయెను..
బాల్యమంతా బరువుతోడ..
బందిఖానాల చిక్కుకునెను..

బాల్యమన్నది ప్రతి మనిషికి..
తీయని జ్ఞాపకంగ మిగులాలి..
కష్టమైన సుఖమైనను..
కమనీయముగ మలచుకోవాలి..



-పసుల.శంకర్
9542181301

## పుట్టిన రోజు.

చిన్ని అక్షర పుట్టిన రోజు
నాన్న కేకు తెచ్చాడు
మామ గౌను కొన్నాడు
అమ్మ ముస్తాబు చేసింది

ఒకటి రెండు మూడు నాలుగైదు
అమ్మో! ఎన్ని బుగ్గలు కట్టారో
వన్ టూ త్రీ ఫోర్ ఫైవ్...
ఎన్ని రంగుల బొమ్మలో

పచ్చని గాజులు వేసింది
ఎర్ర గౌనులో మెరిసింది
నల్లని కురులు విప్పింది
తెల్లని కేకును తెమ్మంది

పిల్లలంతా చుట్టు చేరారు
శుభాకాంక్షలు చెప్పారు
చిన్ని అక్షర కేకు కోసింది
అందరికి పంచి పెట్టింది

పిల్లలతొ కలిసి అన్నం తినింది
అందరు బాగా చదువుకొమ్మంది
అనాధ పిల్లలకు స్ఫూర్తి నింపింది
మళ్ళీ వస్తానని వీడుకోలు చెప్పింది



- ఆవుల చక్రపాణి యాదవ్
9963350973

## నేను అక్షరాన్ని!

అక్షరాన్ని ప్రశం సిస్తారట
అక్షరాన్ని అభిషేకి స్తారట
అక్షరాన్ని ప్రేమిస్తా రట
అక్షరాన్ని పులకింప చేస్తారట
సుమంలా రాలిపోయే క్షణ కాలం
హిమంలా కరిగి నీరైయ్యే లిప్త కాలం
క్షణ క్షణం పరిగెత్తే కాలంలా కాదు
ఆచంద్ర తారార్క యశస్సు తో
అహరహం కీర్తించేలా
నశ్వరం కాని రీతిలో
నగలా శారదమ్మ గళ సీమలో
మంత్రాన్నై ప్రతీ హృదినీ
ప్రతి ధ్వనించేలా
సతత మూ చరియించేలా
ప్రతీ గళంనా నర్తించేలా
యశస్సును కలిగిందని
మేధస్సును పంచిందని
అక్షర మై భాసిల్లింద ని
అక్షరమే ముద్రాక్షరమై ప్రకాసించిందని
అందుకే!... నే నక్షరాస్యులకే కాదు
నిరక్షరాస్యుల కే కాదు
మేధస్సు నార్జించిన వారికి సైతం
నే ప్రశ్నార్థక మౌతుంటాను
ప్రశంసల వర్షాన్ని కురిపి స్తుంటాను
ప్రచండ తేజస్సు తో నే
వెలిగిపోతూ
ఉంటాను
నే క్షరం కాని దాన్ని
నే నక్ష యాన్నీ
నే చరియించే దాన్నీ
నే మీ మదుల్లో
నక్షత్రమై మెరిసే దాన్ని
నేనే అక్షరాన్ని
అవసరం అంటే !....
ఔ తానే నేనే ఆయుధాన్ని!



-దోస పాటి.సత్యనారాయణ మూర్తి.
9866631877

## నవ యువతా కదలిరండి ?

విశ్వజ్యోతి కాంతుల్లారా
ఝాన్సీ రుద్రమ వారసులారా
విప్లవ భారత వీరుల్లారా
వీర శివాజీ సోదరులారా
మరచి పోతున్న మానవత్వ
రాజకీయ, నైతిక
సామాజిక ,ఆధ్యాత్మిక
విలువలను గుర్తుచేస్తూ
నలిగిపోతున్న మహిళాలోకానికి
నవచైతన్య మార్గాలను
నిర్మించడానికి .. ఓ యువతా
మీరంతా కదలి రండి !
కుల ,మత ,ప్రాంతీయ ,వర్గ
భాషా విభేదాలను సృష్టిస్తూ
కల్లోలాలను రేపుతున్న
కలియుగ నరకాసురులను
ఖండించి వేయడానికి .. ఓ యువతా
మీరంతా కదలి రండి !
దేశంలో పేదరికాన్ని నిరుద్యోగాన్ని
అశాంతిని నిరక్షరాస్యతను
పెంచి పోషిస్తున్న అరాచక శక్తులను
అంతం చేయడానికి .. ఓ యువతా
మీరంతా కదిలి రండి !
కుంభకోణాలతో కుమ్ములాటలతో
పరిపాలిస్తూ .. అధికార జులుంతో
ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తూ ..
అస్థిరత్వాన్ని సృష్టిస్తున్న
అవకాశ నీచ రాజకీయాలను
దహనం చేయడానికి .. ఓ యువతా
మీరంతా కదలి రండి !
ఆర్థిక ,వాణిజ్య, పారిశ్రామిక
వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తూ
స్వార్థంతో దేశాభివృద్ధి ని
కుంటు పరుస్తున్న వినాశకర వ్యక్తులను
పేల్చి వేయడానికి .. ఓ యువతా
మీరంతా కదలి రండి !
విదేశీయుల మత్తులో పడి
స్వదేశానికి కన్నం వేస్తూ
దేశాన్ని ముక్కలు చేయడానికి
ప్రయత్నిస్తున్న రాజ ద్రోహ శక్తులను
తరిమి తరిమి కొట్టడానికి ..ఓ యువతా
మీరంతా కదలి రండి !
దేశం మనదని ఘర్జించండి
భారతీయులమని గర్వించండి !!

(అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ...
నేటి యువతకు..నా పిలుపు..)



-రవి చంచల
8500330700

## మాను...మనిషి

మనిషి కన్నా
మాను మిన్న
మనిషి మరణిస్తాడు
బూడిదవుతాడు
మాను మరణిస్తుంది
మనిషికి ఉపయోగ పడుతుంది
మనిషికి స్వార్థం ఎక్కువ
దేవుడు సృష్టించిన
ప్రతిది ధ్వంసం చేస్తున్నాడు
మానుకు పరోపకారం ఎక్కువ
తన సర్వస్వం
మనిషి కోసం దారపోస్తుంది..

మనిషి ఈ భూమి పైకి
వచ్చి పోయే అతిథి
మాను సంతతి
భూమి పై శాశ్వతంగా ఉంటుంది
మనిషి మానును హింసించినా
ధ్వంసం చేసినా
పచ్చగా బతుకుతూనే ఉంటుంది
చెడు గాలిని చెట్టు తీసుకొని
మనిషికి ప్రాణవాయును అందిస్తుంది
పరోపకారం చేస్తూనే ఉంటుంది
మాను లాగా మనిషి బతకాలి ...

మాను మనిషికి
ఆకలికి ఆహార మవుతుంది
ఎండకు నీడవుతుంది
వానకు గొడుగవుతుంది
మనిషి చివరి మజిలీకి
తన తనువునే అర్పిస్తుంది
మానుకు త్యాగం మాత్రమే తెలుసు
మనిషికి స్వార్థం మాత్రమే తెలుసు



-బూర దేవానందం
9494996143.

## పిల్లలు

పిల్లలు మీరే మా కంటిపూలు
నేడు మనదేశము కార్చుచున్నది"క"న్నీరు
పాలుసిరులు పండాల్సిన
పంటచేల(లు)లో,
వేరువేరుగా చేయుచూ,
తేరుకూడా తీయుచూ,
ఉన్న పేరుకు చెదలు పట్టించుచు,
మేలు చేసిన వారికి కీడు చేయుచు,
నాడు మా తాతలు రాసిచ్చిన మాన్యాలు
మావేనంటూ,
నోటికాడ కూడు లాక్కొనుచున్నారు,
కూడులేదని గగ్గోలుపెట్టినా,
పేదవాడి గోడు పట్టలేదెవరికి,
బేల చూపులు చూస్తు,
బాపు నీవైనా మార్చలేవా,
నేటి సమాజపు రూపురేఖల్ని అంటూ
ప్రశ్నల్ని కురిపిస్తున్నా,
కాపులేని పంటలకి కాపెందుకన్నా,
ఏదో ఓ మూలన చిగురించిన చిన్న ఆశ,
పూలలాంటి పిల్లలు-భారత రేపటి పౌరులు
ఎదురుగా ఎదుగుతుండగా,
పాలుపొంగిన సిరులగెడ్డపై
సిరులజల్లులు కురిస్తాయని నమ్ముతు
మా కంటిపూలు కల్మషమెరగని పిల్లలేనని
పిల్లలకు స్వాగతము పలుకుతు
జయహో భారత్ ని నినదిస్తు ..
శుభం శుభం ..
సర్వేజన సుఖినోభవంతు



- విశ్వనాధ నరసింహం
సెల్: 9490971589

## ఉబికి వచ్చిన కన్నీటి ఊట

కష్టాలే నా ఇష్టాలు గా చేసుకొని
కడగండ్లే నా నేస్తాలు గా మలచుకొని
ఉబికి వచ్చిన కన్నీళ్ళ ఊటను
కడుపులో దాచుకొని
సమస్యల కత్తుల వంతెనను దాటుతున్నాను
ఆకాశమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాను

కోడి పుంజుల కూతలను
అలారం గా మలచుకొని
గుడ్డి దీపం కింద
అక్షర ఆణి ముత్యాలను ఏరుకొని
మస్తిష్కంలో మధించుకున్నాను
అలసిపోయిన నా అడుగులకు
ఆశల ఎరువును వేసుకొని
కధన రంగమై కదులుతున్నాను.

నా దేహాన్ని కమ్ముకున్న
కారు చీకట్లను చీల్చుకొని
నా తనువుకు పడిన ముళ్ళ గాయాలకు
ధైర్యపు లేపనాలను రాసుకుంటూ
అక్షర కిరణమై వెలిగాను
విజ్ఞానపు జ్యోతి కి ప్రమిదనవుతున్నాను
వంగిన వరి కంకి లో
నా వెన్ను పూసను చూసుకుంటూ
నిరంతర శ్రామికుడవుతున్నాను
అలసిపోని అలలే నాకు ఆదర్శం
అలు పెరుగని పుడమే నాకు మార్గదర్శనం
మౌనంగా ఎదిగే తరువే నాకు నిదర్శనం



- తాటిపాముల రమేష్
7981566031

## జన హితమే జనశ్రీ అభిమతం

పుస్తక సమీక్ష




సమాజంలోని పోకడలను తెలుపుతూ,వ్యక్తులలో నైతిక విలువలను పెంపొందింపచేస్తాయి శతకాలు .భావి జీవితాన్ని తీర్చి దిద్దుతాయి.సమాజానికి హితం చేకూర్చునదే సాహి త్యం.. సాహిత్యరంగంలో శతక ప్రక్రియకు గొప్ప స్థానమున్నది.ఎప్పుడో రాసిన వేమన,బద్దెన లాంటి కవులు రాసిన శతక పద్యాలు ఇప్పటికీ పండిత పామరుల నాలుకలపై నర్తనమాడు తున్నాయంటె అది ఆ ప్రక్రియకున్న గొప్పతనం..అందించిన కవుల సామర్థ్యము.కవులు రచించిన నీతి శతకాలలోని ఒక పాదము సామెతలుగా నిలిచిపోయాయన్న విషయం అందుకు సాక్ష్యం.శతక పద్య రచన చేసిన కవులు లెక్కకు తక్కువగా ఉన్న సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన ఘనులు.

కాలాన్ని బట్టి,మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాహిత్యంలోను అనేక నూతన ప్రక్రియలు ఆవిర్భవించాయి. నానీలు,కైతికాలు, మణిపూసలు, మొగ్గలు, సమ్మోహనాలు,ఇష్టపదులు తదితర మినీ కవితా ప్రక్రియలలో వాట్సప్, ఫేస్ బుక్,టెలిగ్రాం తదితర సామాజిక మాధ్యమాల వేదికగా వేలమంది కవులు తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు.ఈ ప్రక్రియలలో శతకాలు రాస్తున్న కవులు కూడా ఉన్నారు.ప్రస్తుతము మణిపూసలు ప్రక్రియలో "నిజమిది తెలుసు కొనుము" నూట పన్నెండు మణిపూసలతో మన ముందుకు తీసు కువస్తున్న కవి, గాయకుడు, నటులు, ప్రయోక్త, దర్శకులు , నాటక రచయిత జనశ్రీ కలంపేరుతో రచనలు చేస్తున్న విశ్రాంత ఉపన్యాసకులు కుడికాల జనార్ధన్ గారిని అభినందిద్దాం. కారణంవేమన నాలుగవ పాదం మకుటంగా తీసుకుంటె వీరు మూడవ పాదాన్ని మకు టంగా తీసుకొని నాలుగవ పాదంలో సమాజానికి తను చెప్పదలచుకున్న విషయాన్ని తెలియజేశారు.అంతే కాకుండా నూరు పద్యాలవరకు సర్వలఘు నియమాన్ని పాటించటం ఓ గొప్ప ప్రయోగం. ఇది కవి కవన శక్తికి గీటురా యని చెప్ప వచ్చు. ధన్యవాదపూర్వకంగా చెప్పిన అను బంధ పద్యాలలో ఈ నియమం పాటించలేదు.

**తడబడు నడకలు వలదు**
**పరుషపు పలుకులు వలదు**
**అని చెప్తూ "మనసులకు పరువు కలదు"**
కాస్త గుర్తించండని హితవు పలికారు.
**హిమగిరి శిఖరము శిరము**
**నదుల జలము శుభకరము**
**నిజమిది తెలుసుకొనుము**
**భరత జనని మనకు వరము''**
మనదేశానికి పెట్టని కోటవలే రక్షణనిస్తున్న హిమాలయాలు తలవలేనున్నాయని ,పవిత్ర జలములతో నిండిన నదులతో కూడిన భరతమాత మనకు తల్లి వలె దొరకడం మన అదృష్టమని తనలో దాగియున్న దేశభక్తిని చాటుకున్నాడు కవి జనశ్రీ గారు.

"అనలము,సలిలము,పవనము
మహి సహితము మరి గగనము
నిజమిది తెలుసుకొనుము
కలగలసిన తనువు జనము "పంచభూతమయమైనది మన దేహమన్న నిజాన్ని అల్ప పదాలతో అద్భుతంగా మనకందించారు.

ఇలా..
**"బతుకుకు వలదు కులము"**
**"మనసున అది ఇది విసరకు"**
**"మనిషికి విలువలు బలిమి"**
**"పగ సెగలు విషవలయములు"**
**"ఘనతరము జనకుల కొలువ"**
**కులమత తగవులు వలదు"**
**"బిరబిర నడవదు గజము",**
**"వలపు విలువ కనదు తులువ"**
**"బతుకు చితుకు ధర పెరిగి",**
**"కసి గల మనసు కుటిలము"**
**"వలదు వలదిక వెనుకడుగు"**
**''బుగులు బతుకున దిగులు''**
పాదాలలో మనకు కర్తవ్యసుబోధకంగా చక్కని సందేశాన్ని అక్షరాలలో ఇమిడ్చి అందిం చారు.
**"వరముకు సురలను కొలుతురు",**
**"పుడమిని తొలచిన ఖనిజము",**
జన సుఖము కవి అభిమతము" లాంటి నిజాలను నిర్భయంగా వెలిబుచ్చారు.నూట పన్నెండు(102+10) మణిపూసలతో శతకాన్ని అందించిన జనార్ధన్ గారు వృత్తిరీత్యా రాజనీతిశాస్త్ర ఉపన్యాసకులైనప్పటికినీ తెలుగు భాషపైనున్న మక్కువ ఎనలేనిది.వీరు కవిగా,రచనలు సాగిస్తూనే వివిధ నాటక సమాజాలలో సభ్యులుగా ఉంటూ నాటకాలు కూడా రచించారు.అనేక బిరుదులను సన్మానాలను పొందిన వీరు ఇంకా సాహిత్యంలో ఎదగాలని,ఉన్నతస్థానంలో నిలవాలని కోరుకుందాం

**ప్రతులకు:** జనశ్రీ కుడికాల జనార్ధన్
7-1-47/b/402,రత్నదీప్ రెసిడెన్సీ
బాలసముద్రం,హనమకొండ ,
వరంగల్ (అ)500001.
సెల్: 9703275050



-డా వైరాగ్యం ప్రభాకర్,
9014559059

# రైతేరాజు

రైతే రాజని అన్నారు
ఆ రైతునే దగా చేస్తున్నారు
ఆరు గాలం కష్టం చేసి
పంటలు పండిస్తే
పంటకు ధరయూ లేదాయే
అప్పులు అసలే తీరదాయే
అండగ వుంటామన్నారు
అందలం ఎక్కిస్తామన్నారు
ఎన్నికలయ్యేదాకా
మన్నిక లేని ఎన్నెన్నో
ఉపన్యాసాల ఇచ్చారు
ఊదర గొట్టి పొయ్యారు
రైతుల కలలు తీరదాయే
రంపపు కోతకు గురియాయే
విత్తము లేక విలవిలలాడే
విత్తనాలకై మలమలమాడే
ఎరువులు లేక ఎండిపోయే
కరవు రక్కసికి కందిపోయే
మండూ టెండల్లోన
మంచు చలిల్లోన
కాయ కష్టం చేస్తూనే
కదలిపోయే రైతన్నా
కలగా నిలిచిన కర్షకన్నా
ఎప్పుడు (నీ) ఆశలు తీరేను ?
ఎన్నడు (నీ) గోసలు ఆరేను ?
ఎవడూ (నీ) బాధలు తీర్చేను ?
నిన్నెవడూ ఒడ్డుకి చేర్చేనూ ?
దళారి వ్యవస్థకు అండగ
దోపిడి వ్యవస్థకు నిండుగ
దోcచి పెడుతూ ఉన్న
దొర పాలన చేస్తూ ఉన్న
ప్రభుతలో మార్పు రావాలి
కలతలు అన్నీ తీరాలి
భళె భళె భళె రైతన్నా
భయం లేకుండనే ఉండు అన్నా
అందరి ఐకమత్యంతోను
అన్యాయాన్ని ఎదిరించేయన్నా
అందరమూ మనమందరమూ
అండగ ఉండి పోదాము
అభ్యుదయ జీవితా నందిద్దాము
జయహో జయహో రైతన్నా
జయం జయం జయ రైతన్నా



– గుడికందుల ప్రకాశం
9550894025

# ధర్మం గెలిచింది

(కథ)

ధర్మపురి సర్పంచ్ ధర్మయ్య. చాలా మంచివాడు. పేరుకు తగ్గట్టు ధర్మంగా జీవించేవాడు. చాలా సంవత్సరముల నుండి ధర్మపురికి సర్పంచ్‌గా ఉంటూ గ్రామ ప్రజలకు సౌకర్యాలు కలిగించటమే ముఖ్యమైన పనిగా, వారికి ఎటువంటి లోటు లేకుండా చూసుకుంటున్నాడు. అందుకే అతనిని ప్రతిసారి ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. కనకయ్యది అదే ఊరు ఇతను కుటిల స్వభావం కలవాడు. ఊరు జనులను ఐక్యంగా ఉండకుండా ఎప్పుడు గ్రూపులు చేసి విడదీసేవాడు. ఇతనికి సర్పంచ్ కావాలని ఆశ ఎప్పటినుండో ఉంది. ప్రయత్నించిన ప్రతిసారీ నిరాశే ఎదురు అయ్యేది. అందుకే ఈసారి ముందుగానే తన ప్రణాళికను అమలు చేయాలని, అవకాశం వచ్చినప్పుడల్లా ధర్మయ్యనూ, అతని పనులనూ విమర్శించేవాడు. పంచాయతీ ఎన్నికల సమయం రానే వచ్చింది. నామినేషన్కు చివరి రోజు కనకయ్య ధర్మయ్య కన్నా ముందుగానే నామినేషన్ వేసి, ధర్మయ్యను నామినేషన్ వేయకుండా ఆపాలని, తన మనిషి చేత ధర్మయ్య దొంగని, దొంగతనంగా పంచాయతీ బల్బులు, వస్తువులు నాకు అమ్మినాడని, తాను అనుకుంటున్నాడని పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇచ్చి, పోలీసులు తీసుకొచ్చి కావాలంటే అవి నా దగ్గర ఉన్నాయని ఇదిగో చూడండి. అని చూపించి, మీరు ధర్మయ్యను ఇప్పుడే అరెస్టు చేయాలని అనగా అక్కడికి వచ్చిన ప్రజలు ఎన్నడు రాని పోలీసులు ఊళ్లోకి రావటం, అతను చెప్పింది నిజము అవ్వటం, ఇంతకు ముందు చెప్పిన విషయాలకు ఈ సంఘటన బలం చేకూర్చటంతో ప్రజలు మౌనంగా ఉండిపోయారు. ధర్మయ్యను పోలీసులు తీసుకెళుతుండగా ఇందులో ఏదో మోసం ఉందని గ్రహించిన కొందరు ధర్మయ్య నామినేషన్ వేసిన తర్వాతే వస్తాడని పోలీసు వారిని ఒప్పించి, వారి సమక్షంలోనే నామినేషన్ వేసి స్టేషన్కు తీసుకువెళ్లగా ధర్మయ్యను గురించి తెలిసిన సబ్ ఇన్స్పెక్టర్ విషయం మొత్తం తన వారినడిగి సమగ్రంగా విచారణ చేయగా, కనకయ్య ఇదంతా చేయించాడని, దొంగతనంగా పంచాయతీ ఆఫీస్ నుండి బల్బులు, వస్తువులు తన మనిషి చేత దొంగతనం చేయించాడని తేలింది. ఇది చేయించింది కనకయ్యని తేలింది. దొంగతనంగా పంచాయతీ ఆఫీస్ నుండి బల్బులు, వస్తువులు తెచ్చిన దొంగకు జరిమానా విధించంది కనకయ్యను పోలీసు వారు మందలించి వదిలేశారు . ధర్మయ్య మనస్థాపంతో వేరే ఊరు వెళ్లాలని అనుకుంటాడు ఈ విషయం తెలిసిన గ్రామ ప్రజలు కొందరు అతని దగ్గరకు వెళ్లి మేము మిమ్ములను? తప్పుగా అర్థం చేసుకున్నాము మమ్ములను క్షమించి మీరు ఊరిలోకి రండి మీకోసం అందరూ ఎదురుచూస్తున్నారు. ఈ విషయం తెలిసిన గ్రామ ప్రజలు మేము తప్పుగా అర్థం చేసుకున్నాము అనే బాధ ప్రతి ఒక్కరిలో కనిపిస్తుంది అందరి విజ్ఞప్తులను మన్నించి అతను తిరిగి వస్తుండడంతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది



–వేము రాములు,
9866544192.

# అమ్మ

నవమాసాలు మోసుటకు..
నరకయాతన పడెను..
పురిటినొప్పులు భరించి..
నీకు పురుడు పోసెను..
అల్లారు ముద్దుగా పెంచి..!
బతుకు బాటను చూపునమ్మ..!!

ఒడినే ఉయ్యాల చేసి..
పాటలేన్నో పాడును..
తనువునె పాన్పుగా మార్చి..
ఆటలను ఆడించెను..
ఆట పాటలు నేర్పించు..!
ఆది గురువే అమ్మా..!!

తప్పటడుగులు చూసి..
తన్మయత్వం చెందును..
చిన్నారి పలుకులు విని..
సంతోషపడుతుండును..
సర్వస్వం నీవే అమ్మకీ..!

ఏ మర్మం తెలియని తల్లికీ..!!

పెంచి, పెద్దచేసి నిన్ను..
ప్రయోజకుడిని చేసును..
గెలుపు శిఖరాలు చూసి..
తను మురిసిపోవును..
సర్వస్వం ధారపోసునమ్మా..!
సర్వమే నీవని సంబురపడునమ్మా..!!

ఇన్ని చేసిన తల్లికి..
కొంతైన చేయకుంటివి..
ముసలి తనము రాగానే..
ఆశ్రమముకు పంపిస్తివి..
కడుపు పుట్టిన ఋణమేది..
కసాయి వాడిగా తయారైతివి..

పట్టెడు మెతుకులను..
పెట్టకనేపోతివి..
గుక్కెడన్ని నీళ్ళను..
పోయకనన్నపోతివి..
పాపం ఎవరిది..?
నిన్ను కన్నందుకు ఆ తల్లిదా..?

అమ్మా అని నోరారా..
పిలువకనే పోతివి..
అంటుకైనా వచ్చి..
నీవు చూడకపోతివి..
శాపం ఎవరికి తగిలే..
కర్కశున్ని కన్న ఆ మాతృమూర్తికా..?

గంజినీళ్ళు బుక్కెడన్న..
తాగించక పోతివి..
గటుకన్నమన్నను..
కలిపి పెట్టక పోతివి..
శోకము ఎవరికి..
మూర్ఖున్ని కన్న ఆ జననికా..?

మనసు నిండుగాను..
మాట్లాడకపోతివి..
మనో నిబ్బరమన్నా..
పెంచకుండాపోతివి..
దీనస్థితి ఎవరికి..
దుండగున్ని కన్న ఆ మాతకా..?

లేవలేక వుంటే..
తోడందించక పోతివి..
ఒంటరిగా వుంటే..
ఓదార్పునివ్వవైతివి..
ఒంటరి తనం ఎవరికి..
తుంటరిని కన్న ఆ తల్లికా..?

చేవా లేని తల్లికి..
చేయూతనివ్వుము..
గంజినీళ్లు పోసి..
గుండె ధైర్యమివ్వుము..
అందరున్న తల్లినెపుడు..
అనాథ చేయకుము..

రూపాన్నిచ్చిన తల్లిని..
అపురూపంగ చూసుకో.
కోపతాపాలు వదిలి..
ప్రేమగా చూసుకో..
ముసలితనం నీకస్తదని తెలుసుకో..
కలిమిలేకుండ కళ్ళల్లో పెట్టి చూసుకో..



-పసుల. శంకర్
9542181301

# ఎవరు విశ్వవిజేత ?

కల గన్నవాడు
కసి ఉన్నవాడు
కత్తిలా పదునైనవాడు.

పక్కాప్లాన్ ప్రకారం
ముందుకు దూకేవాడు
ముందు చూపుగలవాడు
పగలురాత్రి శ్రమించేవాడు.

పట్టుదల ఉన్నవాడు
పడినా లేచి పరిగెత్తేవాడు
ప్రయత్నాన్ని విరమించనివాడు
పదేపదే గట్టిగా ప్రయత్నించేవాడు.

తింటున్నా తిరుగుతున్నా
పడుకున్నా నిద్రలో సైతం పని
పని అని కలవరించే పనిరాక్షసుడు.

తల్లిదండ్రుల మాటలు విన్నవాడు
తన శక్తినే తాను నమ్ముకున్నవాడు
తన తప్పులుతాను తెలుసుకున్నవాడు.

భయమన్నది ఎరుగనివాడు
భక్తిలో నిండా మునిగినవాడు
భగవంతునిపై భారం వేసినవాడు
ఖచ్చితంగా విజయాన్ని సాధిస్తాడు
వాడే విజేత...కాదు కాదు వాడు విశ్వవిజేత.....



-పోలయ్య కవి
కూకట్లపల్లి
9110784502

పుస్తక సమీక్ష

# కొట్టి రామారావు నవల 'కంచికి చేరని కథ'

**'సాహిత్యం కన్నీళ్ళను అక్షరీకరిస్తుంది మంచి సాహిత్యం కన్నీళ్లను తెప్పిస్తుంది'**

సాహిత్యాభిమాని, స్థిత్రప్రజ్ఞ, ఒక స్త్రీమూర్తి యదార్థ జీవిత గాధకు నవలా రూపం ఈ 'కంచికి చేరని కథ' అని రచయిత ముందుగానే ఈ నవల పట్ల ఆసక్తి కలిగించారు.

అయితే రచయిత చెప్పినట్లుగా ఆ స్త్రీమూర్తి 'స్థిత ప్రజ్ఞ' కాదని నవల చదివాక పాఠకుడు నిర్ధారిస్తాడు.

అందవిహీనంగా ఉన్న 'రజని'.. తననెవరూ ఇష్టపడరని తనకిక పెళ్ళే కాదనుకున్న సమయంలో వెంకట్రావు ముందుకు వచ్చి 'ప్రేమించి' పెళ్ళి చేసుకుంటాడు.

రజనీ వెంకట్రావుల దాంపత్యం హాయిగా.. ఆనందంగా సాగిపోతుంది. అందుకు సాక్ష్యంగా రజని గర్భవతి అవుతుంది. అయితే ఆరోనెలలో అనారోగ్య కారణాలవల్ల రజనికి అబార్షన్ అవుతుంది.

మందులు వాడటం వల్ల అయితేనేమీ.. పళ్ళు, పోషక పదార్థాలు తీసుకోవటం వల్ల అయితేనేమీ, భర్తగా వెంకట్రావు పంచిన ప్రేమవల్ల అయితేనేమీ ఆమె చాలా లావెక్కుతుంది. అసలే పొట్టిగా, నల్లగా ఉండే రజనీ లావుతో మరింత అందవిహీనంగా తయారవుతుంది. దాంతో వెంకట్రావ్ డైటింగ్ చేయమని, ఎక్సర్‌సైజ్‌లు చేయమని చెపితే విన్పించుకోదు.

సంవత్సరం దాటినా మళ్ళీ రజని గర్భవతి కాకపోవటంతో వెంకట్రావ్ ఆమెను డాక్టర్ దగ్గరికి తీసుకువెళతాడు. 'లావు తగ్గించుకుంటే తప్ప ప్రయోజనముండదని' డాక్టర్ సలహా..

భర్త మాట ఎలాగూ వినలేదు. డాక్టర్ చెపితేనన్నా వినొచ్చు కదా. అయినా వినదు.

'తను ఇంతేనని.. ఎవరు చెప్పినా వినదని.. పైగా ఎవరైనా ఏదైనా ఆమె మంచి గురించి 'ఇలా చెయ్' అని చెపితే.. అది 'వత్తిడి'కి గురి చేయటమేనని ఆమె క్యారెక్టరైజేషన్ గురించి రచయిత వివరించారు.

మేకప్ వేసుకోవటం, పైపై మెరుగులు దిద్దుకోవటం ఆమెకు ఇష్టం లేకపోయినా.. భర్త చెప్పినప్పుడు వినాల్సింది. సరే అది ఆమె వ్యక్తిగతం అనుకున్నా.. లావుకావటమన్నది పిల్లలు కలగక పోవటానికి ప్రధాన అడ్డంకి అని డైటింగ్ చేయమని, ఎక్సర్‌సైజ్ చేయమని డాక్టర్‌తో పాటు భర్త చెప్పినా వినకపోవటం.. ఆమె శారీరక వికృత రూపానికే కాదు మానసిక వికృతత్వానికి సాక్ష్యం.

అసలే పిల్లలంటే ఆసక్తి. ఇష్టం ఉన్న వెంకట్రావ్‌కు ఇది తీరిపోని సమస్య.

సరిగ్గా అదే సమయంలో అతని అక్క కూతురైన 'పద్మ'తో అతనికి చనువు ఏర్పడుతుంది. దానిక్కారణం వెంకట్రావ్ కాదు.. అక్క మనసులో ఉన్న ప్లాను, పద్మ మనసులో ఉన్న ఇష్టం. తన తమ్ముడు వెంకట్రావ్ భార్యతో సుఖపడట్లేదు అని గ్రహించిన అక్క, తన కూతుర్ని తమ్ముడికిచ్చి రెండో పెళ్ళి చేయాలనుకుంటుంది.



పెళ్ళి చేసుకోవడానికి కూతురు కూడా సిద్ధపడుతుంది.

ఇదంతా తెలిసినా.. తనను తాను మార్చుకోవడానికి గానీ, భర్తను మార్చటానికి గానీ రజని ప్రయత్నించదు సరికదా. ఒక్కపూట అక్క ఇంట్లో భోంచేసి.. వచ్చాడన్న కారణంతో అతనికి వంట చేయటమే మానేస్తుంది.

మానసికంగా విడిపోయిన ఇద్దరూ.. భౌతికంగా కలిసుండటం వృధా అని 'విడాకులు' తీసుకోవడానికి సిద్ధపడతారు. ఇంట్లో ఉన్న భర్త సామాన్లన్ని తానే సర్ది.. చక్కగా ప్యాక్ చేసి.. 'ఇక నీకూ నాకూ ఏ సంబంధం లేదు పో" అంటుంది.

ఇదే అదునుగా భావించిన వెంకట్రావ్ ఆనందంగా ఆ యింట్లో నుండే కాదు ఆమె జీవితం నుండి కూడా వెళ్లిపోతాడు. అయితే వెంకట్రావ్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగులుతుంది. అక్క ప్లేట్ ఫిరాయిస్తుంది. వెంకట్రావ్‌కంటే మంచి సంబంధాన్ని కూతురికి తెస్తానన్న భర్త మాటలకు తలాడిస్తుంది. పద్మ కూడా తల్లిదండ్రులు ఏం చెబితే అదే వింటుంది. ఇప్పుడు వెంకట్రావ్ రెంటికి చెడ్డ రేవడు అయ్యాడు.

ఇందులో తప్పెవరిది?

భర్త మాటలే కాదు డాక్టర్ మాటల్ని కూడా వినకుండా మొండితనంతో ప్రవర్తించిన రజనిదా?

తమ్ముడికి కూతుర్నిచ్చి పెళ్ళి చేయాలనుకున్నప్పుడు ప్రేమతో.. వద్దు అనుకున్నప్పుడు అంటీ ముట్టనట్టుగా వ్యవహరించిన అక్కదా?

తల్లి వెంకట్రావ్‌ను ప్రేమించమనగానే ప్రేమించి.. తండ్రి 'వద్దు' అనగానే విరమించిన 'పద్మదా?'

అదవిహీనురాలైన సరే ప్రేమించి పెళ్ళి చేసుకున్న వెంకట్రావ్‌దా?

సరే- వెంకట్రావ్ విషయం అలా వదిలేస్తే..

స్థితప్రజ్ఞురాలు అనుకున్న ఈ 'చంచల' రజని వెంకట్రావ్‌కు దూరం అయ్యాక మరో సుబ్బారావ్‌కు సారీ రాజశేఖర్‌కు దగ్గరవుతుంది.

అతనికి చాలా అందమైన భార్య ఉంటుంది. పాప ఉంటుంది. అయినా సరే.. 'ఎందుకో మరి?' ఆ యింట్లోకి అతనితో 'సహజీవనం'.. అంటూ ఉన్నమాట చెప్పాలంటే.. "ఉంచుకున్నదానిలా" వెళుతుంది.

ఒకప్పుడు భర్త తనను కాదని అక్క కూతురు పద్మతో క్లోజ్‌గా ఉంటున్నాడని.. పెళ్ళి చేసుకోబోతున్నాడని.. తనలో తానే కుమిలిపోయి.. రగిలిపోయి.. తల్లడిల్లపోయిన ఈ 'స్థితప్రజ్ఞ' భర్త మరో పెళ్ళి చేసుకుంటే ఏ స్త్రీ అయినా తనలాగే బాధపడుతుందని ఈ 'అనుభవజ్ఞురాలు' ఎందుకు ఆలోచించలేదో గానీ మరో స్త్రీకి 'సవతి'గా వెళ్ళింది.

అక్కడ కొంత కాలం గడిచాక గానీ ఆమెకు తెలిసిరాలేదు.

తన జీవితం కుక్కలు చింపిన విస్తరి అయ్యిందని. ఉంచుకున్న వాడు.. ('రాజశేఖర్) చనిపోయాక.. అందరూ తనను అవమానించి.. ఒంటరి దాన్ని చేసారని బాధపడటం హాస్యాస్పదంగా అన్పిస్తుంది. అయితే ఈ కథ.. 'నిజంగా జరిగిన' కథ కాబట్టి ఇలా ఉంటే బాగుండేదనో.. అలా మారిస్తే బాగుండేదనో అనుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే ఇది కథకాదు జీవితం కాబట్టి..

జరిగిన కథను జీవితంలా కళ్ళముందు దృశ్యాలను అక్షరీకరించిన కొట్టి రామారావుగారి రచనా నైపుణ్యం పాఠకుల్ని అబ్బురపరుస్తుంది. అక్కడక్కడా మీరు వాడిన 'ఆపరేషన్ సపరేషన్' 'మర్యాద లక్ష్మి' లాంటి పదాలు బాగున్నాయి.

వారి పరిధిలో వారు చూసిన, లేదా.. చెప్పగా విన్న ఒక జీవితాన్ని నవలగా రాసి పాఠకులకు అందచేయటం అభినందించాల్సిన విషయమే.

ముగింపు:

భూమి గుండ్రంగా ఉంటుంది నిజమే ఇది మనిషి జీవితానికి కూడా వర్తిస్తుంది. అందరూ ఉన్నా.. ఎవ్వరూలేని అనాథలా ఒంటరితనంతో బతుకీడ్చిన రజని.. జీవితంలోకి వెంకట్రావ్ వచ్చాక ఆమె జీవితం ఆనందంగానే సాగింది. అతను చెప్పింది విని, డాక్టర్ సలహా పాటించి ఉంటే రజని వెంకట్రావ్‌ల "కథ కంచికే వెళ్ళేది".

భర్త మాట వినకపోవటం వల్లే.. ఆమె అయోమయ, అసందిగ్ధ, అసంపూర్ణ జీవితాన్ని గడిపింది. పైగా భార్య, కూతురు ఉన్న మరో వ్యక్తికి ఉంపుడు గత్తెగా వెళ్ళింది. ఇలా వెళ్ళేదే అయితే భర్త మరో పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు.. 'ఓకే' అంటే సరిపోయేదిగా?

'భార్య'గా ఈవిడ, గౌరవం ఈమెకుండేది. అంత ఆలోచన, పరిపక్వత ఆమెకు లేకపోవటం వల్ల ఆమె జీవితం దుఃఖమయమైంది.

"దొడ్డిదారి నుండి వెళ్ళిన మన 'గతమే'.. మళ్ళీ కొత్తగా.. వీధి గుమ్మం నుండి 'భవిష్యత్తు' రూపంలో ఎదురొస్తుంది."

**ప్రతులకు:** కొట్టి రామారావు
23-247-7, బచ్చుపేట-
మంచీపట్నం.
సెల్: 9908789405



– కాంచనపల్లి రాజేందర్ రాజు
సెల్: 9849226423

# 'నరక' నవ్య నర పోకడలు

నాయకుల శుష్క వాగ్దానాలు
ఓటర్లకు ఓట్లే ఆదాయాలు
విమర్శల వర్షాలకే ప్రతిపక్షాలు !

ఉద్యోగుల మురికి చేతులు
రాత్రుల్లో చీకటి ఒప్పందాలు
పసలేని ప్రభుత్వ పథకాలు !

వ్యాపారుల కల్తీల లీలలు
పారిశ్రామిక కాలుష్యాలు
వ్యాపార ధోరణిలో మాటలు !

మానవీయతకే చెరగని మరకలు
షరతుల చట్రంలో బంధాలు
ఆస్తులకే కుటుంబ విచ్ఛిన్నాలు !

హత్యలే జీవనోపాధులు
శ్వేత వస్త్ర ముసుగులో అక్రమాలు
పట్టపగలే దొంగల స్వైరవిహారాలు !

విషాన్ని కక్కుతున్న మతాలు
కొట్లాటలకే కులమతాలు
నేరాలే రాజకీయ అర్హతలు !

అంగట్లో సరుకులైన అతివలు
సరోగసీ అద్దె అమ్మ గర్భాలు
అమ్మకానికే అమ్మతనాలు !

మానవత్వానికి పట్టాభిషేకాలు
సమాజహిత మనో వేదనలు
కావాలి రేపటి తరం పునాదులు !



-మధుపాళీ
9949700037

# బాల్యం బరిలో బంధీ

బాల్యం స్మృతి గీతం
బాల్యం తరగని గానం
ప్రతి హృదయం పొంగి పొరిలే
ప్రవాహం సౌందర్యం
కడలి తీరం చేరె
కెరటమై అలల తీరు
జీవన సాగర జాన బాల్యం
చిలుక పలుకులు
కోకిల కూతలు
నెమలి నాట్యాలు
ఉడుం పట్టు పోటీలు
ఈల పాటలు గోలలు
చిలిపి చేష్టల ఆటలు
అలకలు ఆనందాలు
బాల్యం జ్ఞాపకాల నాటి గుర్తులు
నేడెందుకో కనుమరుగై కానరాకున్నాయి
నాటి బాల్యం స్వేచ్ఛా పావురం
నేటి బాల్యం పంజరాన చిలుక
నాటి బాల్యం హద్దులు లేనిది
నేటి బాల్యం బరిలో గిరిలో బంధీ.



-ఉప్పెన
8106073661

# కానరాని మెతుకు

అతడు కర్మయోగి
మట్టి మర్మమెరిగిన
భూమి పుత్రుడు.!
అప్పుల సర్పాన్ని ధరించిన
బోళా శంకరుడు.
చీడ పట్టిన చేనులా
ఊగిస లాడుతూ
నిట్టూర్పుల సేద్యం చేసే'దధీచి'.
అమాత్యుల ఆదేశం లేనిదే
అతడు విత్తనూ లేడు,
అమ్మనూ లేడు.
దళారి నక్షత్రకుల
బారిన పడ్డ 'హరిశ్చంద్రుడతడు.
'సెజ్'ల వలలో చిక్కి సగమై
'బషీర్ బాగ్ ' లో నేల కొరిగి
రింగ్ రోడ్లో భూస్థాపితమైనాడు.
కార్పొరేట్ ల కబంధ హస్తాల్లో
ఫామ్ హౌజ్ ల సేద్యం.
అతడిప్పుడు
ఒలికి పోయిన బతుకు గంజిలో
కానరాని 'మెతుకు'.!!



-కమలేకర్ శ్యామ్ ప్రసాద్ రావు
9441076632

# కలిసిన కాపురం

కలిసి నడుస్తున్నాం
ఏళ్లకేళ్లు చల్లని పిల్ల గాలిలా వెళ్ళిపోయాయి
ఉక్కపోతలు , వడదెబ్బలు ఎన్ని తగిలినా
కష్టాలు కాష్టాల దాకా సాగనంపాం
రూపాయితో కాపురం చేయలే
మాటలనుకున్నాం మనసు చంపుకోలే
భావాలను, బంధాలను అర్థం చేసుకున్నాం.

జీవన సముద్రం ఒడ్డున
ఇసుకలో కలల గూళ్ళు కట్టుకున్నాం
అలలు అక్కసుతో కూల్చేసినా
మళ్లీ మళ్లీ కట్టుకుంటూనే గడుపుతున్నాం కాలం
అవి తరగని జ్ఞాపకాల నిధులు.

చెరువులో అలలు చిన్న చిన్నవే
మొఖం చూసుకోలేక నిండు చంద్రుడు సతమతం
అలలను ఆపి పడుకోబెట్టలేం
కురిసే చినుకులు చెరువులో ఆడుకుంటాయి

తల్లి ఒడి చేరిన తన్మయత్వంతో
మన మధ్య బంధాలు అంతే.

బావిలో నీళ్లు చేదుతుంటే రెండు చేతుల ఆసరా
బొక్కెన పడ్డ కొద్దీ బాధతో నీళ్లు చెల్లాచెదురు
అయినా నిండి పైకొస్తాయి లోకం చూసేందుకు
మనం మలినాలు కడుక్కుంటాం.

ఎవరి శరీరంలో తడి వారిదే
చేతులు కలిపి కదిలితే చెమట మట్టి పాలైనా
ధైర్యం దండి కొట్టదు.

ప్రేమ ప్రయాణంలో వీచే గాలి స్వచ్ఛమైనదే
గాలి దుమారాలెన్ని వచ్చినా దులిపేశాం
దుక్కపు అనుభవాలు తెలుసుకున్నాం
నవ్వు ముఖాల విలువ పెంచుకున్నాం



-కొమురవెల్లి అంజయ్య
9848005676

# రైతన్నా

భూమికై పుట్టాడు
భూమినే నమ్ముకున్నా
వర్షంతో హర్షించాడు
కడుపే నింపేరైతన్నా!!

తనతల్లి ఎవరైన
భూమి పుత్రుడిలా
వెన్నులా ఈదేశాన
అయ్యాడు తల్లిలా!!

పదివేళ్లను భూమిలోపోనిచ్చి
పంటనే పండించాడు
మన ఐదేళ్లను నోటిలోపోనిచ్చి
ఆకలినే తీర్చాడు!!

రైతన్న నవ్వాలంటే
ఎంత కష్టమో
కష్టంతో ఎదగడమంటే
ఎంతటి ఆనందమో!!

పొలం పండాలంటే
జోడెద్దులు దున్నాలి
రైతన్న ఉండాలంటే
వరుణుడే కరుణించాలి!!

ఆలితాళి అంగట్లోఎట్టాలి
విత్తనం విత్తాలన్నా
పురుగులమందు కొనాలి
తాగిప్రాణమే విడిచే రైతన్నా!!

పంటనష్టమొచ్చిన పండకున్నా
కొయ్యకు ఊగాడే
బురదమనిషైన రైతన్నా
ఆలితాళేతెంచేసే అన్నధాతుడే!!
ధాన్యముండదు రైతింటా

ధానుడై నిలిచిన
నీరుతప్పదు కంటా
కొయ్యగూకకు ఇకనైన!!

నీవు లేకపోతే
పంట పండేన
నీవే కరువైతే
మన దేశముండేన!!

బీడుభూమైన నీకైపండునన్నా
భూమి నీ సొంతం
రతనాలుపండించే రైతన్నా
నీకులేదన్న అంతం!!



-మల్లె రంజిత్ కుమార్
7032650908

# చెట్లు

ఉచితంగా తామిచ్చే
ఆక్సిజన్ కాదని
ప్లాట్లు కోసం నరికి
పాట్లు పడుతున్న
జనాన్ని చూసి
నివ్వెరపోతున్నాయి.

ఊపిరి సలపనివ్వని
కరోనా విషవలయం లో చిక్కి
ఊపిరిని నిలుపునే
ఆదుర్తలో ఆక్సిజన్ కోసం
ప్రాధేయ పడుతున్న
జనాన్ని చూసి
నిర్ఘాంతపోతున్నాయి,

ప్రాణవాయువునిచ్చే
తమని కాదని
కృత్రిమ శ్వాస కోసం
వెంటిలేటర్లను ఆశ్రయించే
జనాన్ని చూసి
నిశ్చేష్టలవుతున్నాయి.

ఇకనైనా భవిష్యత్ లో
తమని కాపాడి
పెంచుకుంటే ఏ ముప్పు రావని
ప్రార్థిస్తున్నాయి



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

# రైతంటే అన్నం పెట్టే అమ్మ

రెక్కలు ముక్కలు చేసుకొని
బురద నుండి బువ్వను తీసి
ప్రపంచానికి పంచుతున్నా
గొడ్డు గోదతోటి గోసపడుతున్నా
హాలికుల అంతస్తు అధమమే
జీవన సాగరం ఛిద్రమే.

ఆరుగాలం కట్టబడి
రత్నాల సిరులు రాశులు పోస్తే
పదికొన్నోడు పది నిమిషాల్లో నే
వందకమ్ముకొని పందికొక్కవుతూ
ఖరైదైన కార్లల్లో తిరుగుతుంటే
అరిగిన పాదరక్షకాలతో
ఎండకు ఎండుతున్నాడు
పేగులను ఆరబెట్టుకుంటున్నాడు.

ప్రకృతి ప్రకోపించినా
నీరు పైరును నిండా ముంచినా
నకిలి విత్తనపోడు నట్టేటముంచినా
పురుగు మందులోడు పుట్టి ముంచినా
పుడమిని చీల్చుకొని తన్నుకొని
మొలకెత్తే మొలకలా
భవితపై ఆశల సౌధాలు పేర్చుకుంటాడు
పుడమిని ఎదలో పూజించుకుంటాడు
ఏరికోరి ఎన్నుకున్న ఏలికలు
రైతన్న కాళ్ళలోకి కట్టెలు విసురుతున్రు
పచ్చని పైరులో చిచ్చు పెడుతున్రు
రైతన్న గుండె లో గుణపాలు దించుతున్రు
రైతన్న కడలిని ఎడారి చేస్తున్రు.

రైతంటే అన్నం పెట్టే అమ్మ
ఆర్థిక రంగానికి రథసారధి
కల్చర్‌కు నిజమైన వారధి
పని విలువ తెలిపే నేర్పరి
పుడమిని కాపాడే రోహితుడు



-తాటిపాముల రమేష్
7981566031

# నానీలు

తనువెల్ల
గాయాలు చేసి 'నా'
మట్టి 'మాత్రం' మనిషి
కడుపే నింపుతుంది.

వానచినుకుకైన
చెమట బిందువు కైన
మట్టి సువాసనతో
గుభాళిస్తుంది

ఏ స్వార్థం
ఎరుగనిది మట్టి
గర్భంలో విత్తిన
విత్తుకు పురుడు పోస్తుంది.

మట్టిలో తేడాలు
ఉండవచ్చు
కానీ స్పందించే
గుణం ఒక్కటే



-చాపలమహేందర్
9949864152

# శవం



ఒక రాత్రో.. ఒక పగలో..
ఆగిన గుండెను భరిస్తున్న శరీరాన్ని చూసో..
శరీరం మీద ఈగలు చేస్తున్న
నృత్యాన్ని చూసో..
ఇది శవమని ధృవీకరిస్తాయి
మాట్లాడే చూపులు-

ధృవపత్రాలలో
నేనో-నువ్వో
ఎవరైనా కాని
ఇప్పుడో... ఎప్పుడో ఒకప్పుడు శవం కావాల్సిందే-

చూపుల నుంచి
కారుతున్న ధారను దుఃఖమంటారట
రెప్పల మధ్య కనిపించని తడిని
బాధంటారట.
ఏది ఏమన్న
శవం చూడదు, వినదు.

ఆత్మీయతతోనో..
శతృత్వంతోనో..
'పీడ వదిలిందనే పెదవులు దాటరాని ప్రేమతోనో
మాట్లాడే చూపులు
మాట్లాడుతూనే వున్న
శవం చూడదు. వినదు.

ఒక రాత్రో.. ఒక పగలో..
సొంతమో.. అద్దెనో.. ఒక ఇంటిలోనో
ప్రైవేట్.. ప్రభుత్వమో.. ఒక ఆసుపత్రిలోను
ఆకాశమో.. రోడ్డో... తదా ఒక అడవిలోనో
హత్యో.. ఆత్మహత్యో.. యాక్సిడెంటో
వృద్ధాప్యమో.. రోగమో..
....
శరీరాన్ని
శరీరం మీద ఈగలు చేస్తున్న నృత్యాన్ని
మాట్లాడే చూపుల్ని శవం చూడదు, వినదు
నేనో.. నువ్వో ఎవరైనా కాని
ఇప్పుడో ఎప్పుడో అప్పుడో శవం కావాల్సిందే-
శవం తాలుకు శరీరాల ధృవపత్రాలే
ఈ
శవం-
ఇంట్లో వచ్చిపోయె కరంట్‌లా..
ఆరడుగుల నేలలో పూడ్చినా
ఆతని మంటలో కాల్చినా, మళ్ళీ మళ్ళీ పుడుతునే వుంది.
పునారావృత్తం అవుతూనే వుంది
ఈ శవం మరణం లేనిది.. ఇది చిరంజీవి
ఈ శవం అదృశ్యంకాని సజీవ నిత్య దృశ్యాలు!

ఇప్పుడు
నా జేబులో శవాన్ని పెట్టుకొని తిరుగుతున్నాను
ఎక్కడ సమ్మేళనం జరుగుతోందో
ఎక్కడ కవిమిత్రులు.. ఆత్మీయ మిత్రులు
ఆప్త బంధువులు.. అభిమానులు.. మరి
ఎక్కడైతే నా విశ్వజనం చిరునవ్వు'ల'తో
ఎదురౌతారో.. ఆశ్రయం ఇస్తారో
అక్కడ ఈశవాన్ని వినిపిసాను..
చూపిస్తాను..!



-జనజ్వాల
సెల్:9949163770

# కాలుతున్న కాష్టం

కాలచక్రం తిరుగుతోంది
బతుకుచట్రం అరుగుతోంది
తిరిగే చక్రంలో
అరిగే చట్రంలో
కష్టానికి విలువేది
పాలకుల పద్ధతేంది.

రైతుశ్రమ రాశిపోస్తే
రాబందులై పీక్కుతింటున్నరు
దళారీలు దౌర్జన్యనీతో
వ్యాపారులు వంచనతో

మిల్లర్లు మోసాలతో
కర్షక నీ కష్టం
కాలుతున్న కాష్టం.

కార్మికులకాయాల్లో గుండెచప్పుడు
కర్మాగారాల్లో కదిలేయంత్రచప్పుడు
పెట్టుబడుల రాబడిలో
నెత్తుటిర్ఘురిలోనెరిబడ్డబతుకులు.

కార్మిక నీ కష్టం
కలిగినోని పుష్టి

దోచబడ్డ దోపిడి
అణచబడ్డ రాపిడి
ఎదలోరగిలిన జ్వాలై
ఎగిసెను విప్లవమై

కర్షకా....!
కార్మికా....!!
మనమిప్పుడు
పోరుఇరుసుకు ఇరుచక్రకాలై సాగాలి



-జినుకల వెంకటేష్
9652092120

# రారాజు రైతన్న

బంగారు భూముల్లో సాగుచేసే రైతన్న
నేడు బంజరు భూముల్లోకి వచ్చాడు
తన బీడుబడిన భూములను చూస్తే
తెలుస్తుంది మన రైతన్న గోడు
భూమి భారం తన భుజాన మోసి
బ్రతుకు దారిని చూపుతున్నాడు
ఊరే జలపాతమై రైతన్న ఉప్పొంగుతున్నాడు
పారే సెలయేరులా ప్రవహిస్తున్నాడు
ప్రవహించే నదిలా పరుగులు తీస్తున్నాడు
పచ్చదనంతో రైతన్న పరిమళించి పోతున్నాడు
పొద్దున్నే సూర్యునిలా ఉదయిస్తున్నాడు
సాయంత్రం చీకట్లో దీపం అవుతున్నాడు
రైతన్న హస్తానికి తెలియదు హోదాలు
రైతన్న కరములకు తెలియదు కులాలు
ఆకలయ్యే వారికి అన్నం పెట్టడం తప్ప
మూగజీవాలను పోషించి రైతన్న
మతిలేని మానవాళి కోసం మూగవాడవుతున్నాడు
సృష్టికి ప్రతి సృష్టి చేసిన రైతన్న
నేడు ముష్టి వాడై పోతున్నాడు
కాళ్లు చేతులను పనిముట్లుగా చేసి
తన రక్తాన్ని ఎరువుగా చేసి
చెమట నీరుగా పోసి
పొలం పండిస్తున్నాడు
కానీ నాటికి నేటికీ రారాజు రైతన్నే.



-కందుల తరుణ్
9618815325

# నేటి మహిళ

ప: నేటి మహిళా, నేటి మహిళా
నేటి మహిళ, మేటి మహిళా
ఆకాశమె తన హద్దంటూ
సరిహద్దు తనకు లేదంటూ
మేటి రూపమై నిలిచింది, నేటిమహిళా
నేటి మహిళా, మేటి మహిళా.

చ: ఆడది అంటె అబలగాదని
ఆదిశక్తిగా వెలిసింది
శక్తియుక్తి విజ్ఞానంతో విజయవిహారం చేసింది
నిదురలేచిన నేటిమహిళ
వెలుగుతున్న ఒక దీపంరా
వెలిగించే ఒక దీపంరా
నేటి మహిళా, నేటి మహిళా
నేటి మహిళా, మేటి మహిళా ॥నేటి॥

కరుణలలో తాను కన్నతల్లిగా
భూమాతగ నిలిచింది
చేయి చేయికలిపిన మహిళ
సంఘ సభ్యులను నిల్పింది
వ్యవసాయం, పశుపోషణ, సేవా భావనరంగంలో
చేతివృత్తి చేపట్టింది, బతుకునావలో సాగింది ॥నేటి॥

చదువు సంధ్య సంస్కారంతో
ఉద్యోగాలే చేసింది
రాజ్యమేలే రారాణిగా రాజ్యాన్నే పాలించింది
పుడమి తల్లి పురటి నుండి
అంతరిక్షపు అంచుదాటింది
స్నేహహస్త మందించింది. స్నేహ మస్తమందించింది. ॥నేటి॥

ఫ్యాక్టరీలలో, వ్యాపారంలో, యాజమాన్య వ్యవహారాల్లో
తనకు తానుగా నిలిచింది





-డా॥బండారి సుజాత శేఖర్

# బతుకనేర్పే బతుకమ్మ



ప్రకృతికి ప్రతిరూపం
ప్రకృతే నీవైన రూపం.
బతుకునిచ్చేవు
బతుకు నేర్పేవు
బతుకునీవైన బతుకమ్మ.
నిన్ను,నన్ను ఏకం చేసేదే బతుకమ్మ....
బతుకంతా దీవిస్తూ దారి చూపేవు..
అతివలందరూ భక్తితో కొలిచే బతుకమ్మ,...మా అమ్మ.
తంగేడు,గునుగు,గన్నేరు,..
చేమంతి,మందార పూలను దేహం నిండుగా కలిగి
కనులకు ఇంపు నిచ్చేవు...బతుకమ్మ...
తొమ్మిదిరోజులు నవనైవేద్యాలు స్వీకరిస్తూ,
వెలదులు ఏడువారాల నగలను ధరిస్తూ,
వైవిధ్య పాటల కరతాళధ్వనులను చేస్తూ,
వలయాకృతిలో నిన్ను స్తుతిస్తూ...
మహిళలలో మనో దయిర్యాన్ని పెంపొందిస్తూ,
అందరి హృదయాలు తృప్తితో తరిస్తూ...
పుట్టినిళ్ళకే ఓ కళ నిస్తావు...బతుకమ్మ...మా అమ్మ
తెలంగాణ మహిళల పండుగ,
ఆనందాలు ప్రతి ఇంటా నిండగ,
ఏటేటా మమ్మల్ని దీవిస్తుండగ,
నీవే సంస్కృతికి వారధిగా నిలుస్తుండగ,
'బతుకమ్మ' ..అని మేమంతా నిన్ను కొలుస్తుండగా...
ఆనందమే...ఆనందం మా ముంగిట్లో...
బతుకమ్మా..మా బతుకులను చల్లగా చూడమ్మా...
ఏటేటా ఇలాగే రావమ్మా...
ఈ వసుధపై శోభను తేవమ్మా...
బతుకమ్మ



-డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 350వ రోజు 'విజయదశమి' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'విజయదశమి' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839



## రోజొక్కతీరు

బ్రహ్మ ముఖం నుండి
వర్ధిస్తున్న శక్తి ఉద్భవం
శివుని శరీరం నుండి శివశక్తి
విష్ణు శరీరం నుండి వచ్చిన
వైష్ణవ శక్తి సుందరమై భాసిల్లే.
అగ్ని వరుణ యమ కుబేరులు
సకల దేవతల నుండి పుట్టిన
తేజస్సులన్ని ఒకచోట చేరి
మహిమాన్వితమైన
పరదేవతా రూపం భాసిల్లెను!!.
మహిని పీడిస్తున్న మహిషాసురుని
పీడ వదిలించ శక్తి ఉదయించ
ఇంద్రాది దేవతలు సంతసించి
అమ్మవారికి ఆభరణములు
పట్టు పీతాంబరములు
ఆయుధముల నొసగిరి!!.
ఆశ్వయుజ మాసంలో
శరత్కాలంలో
పాడ్యమి మొదలు దశమి వరకు
రోజొక్కతీరు అవతారం
సాక్షాత్కరించి
జనుల బ్రోచుచుండె!!.



-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

## విజయదశమి విశిష్టత

ధసరా పండుగ రామరాజ్యయశమై ధర్మమ్ము,త్యాగమ్ములన్రా
జసమై వర్ధిలె పాలనమ్ము వసుధా చక్రమ్ములోయోగమై;
అసురుల్ జేసిన దుష్టకార్యముల సంహారమ్ము శౌర్యమ్ము; తే
జస చిహ్నమ్ముగ పర్వమై నిలిచె సౌభాగ్యమాశ్వీజమున్!!.

కొమ్మ మాటున దాగిన యమ్ములన్ని
దిమ్మ దిరిగెనుత్తరునికి తీత మన్న
నమ్మశక్యము కాకుండ నాతిశయము
జమ్మి చెట్టున తీసెను సవ్యసాచి.

విజయ ద"శమి"విజయునికి ప్రీతినిండె
వ్యాస యోచనా ఫలముల వర్ధనమ్ము
సుజన పరిపాల పాండవ సుతుల గెలుపు
భరత వంశమ్మునితిహాస భాగ్య గాథ.

అవతారమ్మున రాఘవుండు భగవదంశాంకురమ్మై భువిన్
నవరాత్రుల్ కడుపూజలందుప్రభువే నారాయణుండై ధరన్
స్తవముల్ ,స్తోత్రములు ,త్సవమ్ములును సీతారామ కల్యాణమున్
శ్రవణమ్మే ముద మౌచు తోచు దసరా సద్భావ పర్వమునై.



-మాడుగుల నారాయణ మూర్తి

## అంతరార్థం!

ఈ బ్రహ్మాండ భాండాల చక్రం
ఆమె చేతిలో!
అపరాజితగా విరాజిల్లు
త్రిమూర్తుల తేజస్సుతో భాసించే!
మహిషాసుర సంహారిణి
విజయాలనిచ్చే రాజరాజేశ్వరి!.
రావణసంహారంతో రాముడు
గాండీవం పట్టి విజయుడు
జయంపొందిన విజయదశమి
చెడుపై మంచిగెలిచె!
పాపాల పుంజాలు
అమ్మ స్మరణతో పటాపంచలు!.
దైవీశక్తి సృష్టి లో
జీవులంతా బొమ్మలు!
అందుకే పెడతాం
నవరాత్రుల బొమ్మలకొలువులు!
అయ్యవారికి చాలు ఐదువరహాలు!
పిల్లవాండ్లకు చాలు
పప్పు బెల్లాలు
ఆనాటి మాష్టారు శిష్యులకు
సరదా దసరా పాటల సంబరాలు!.
కామక్రోధాదులను జయించి
మహిషంలా ఎగిరెగిరి పడే
తుచ్ఛభావాలు చేతలను
చీల్చి చెండాడిన సింహవాహిని.
మనోనిగ్రహంతో
కార్యోన్ముఖులయ్యేలా
మనలోని శక్తి యుక్తులను
సకారాత్మకంగా వినియోగించాలి!
పాలపిట్ట దర్శనం శమీపూజతో
మనిషిలో పాదుకును దైవత్వం!.
దానవత్వం పెచ్చు పెరిగె
దయాగుణం మాయమయ్యె!
దశదిశలా అలుముకునే
అంత: బాహ్య శత్రువుల మధ్య
కరోనా తాండవం!
అన్ని రంగాల్లో
దీక్ష పట్టుదల శక్తి యుక్తి పెరగాలి!
అప్పుడే నిజమైన విజయదశమి!.

-ఎ.రాజ్యశ్రీ

## పూజలు అవతారాల

సృష్టికి కారణం అమ్మే
ప్రతిసృష్టికి కారణం అమ్మే
లోక కళ్యాణార్థం అమ్మ
తొమ్మిది అవతారాలెత్తింది
నవ మాతల ఆరాధనం
సకలం శుభప్రదం
బాల త్రిపురసుందరి
గాయత్రీ దేవి
లలితా పరమేశ్వరి
అన్నపూర్ణ మహాలక్ష్మి
సరస్వతీ దేవి విజయ దుర్గ
మహిసాసుర మర్ధిని రాజరాజేశ్వరి
నవ మాతలకు నవ రాత్రులు
మనసా వాచా పూజలు
కష్టాలన్ని కడతేరాలని
దేవిని ప్రార్థన
నవ మాతలకు
వస్త్రాలంకరణం
నిత్య కుంకుమార్చనలు
అమ్మలకిష్టమైన
ప్రసాదాలు సమర్పణం
త్రికరణ శుద్ధితో పూజలు
సకల సౌఖ్యాలను
ప్రసాదించమని ఆరాధనలు
లక్ష్మీదేవి కటాక్షంతో ఐశ్వర్యం
సరస్వతీ కటాక్షంతో విద్య
నవ మాతల ఆశీస్సులతో
అనుకున్నవని అవుతాయని
నవరాత్రుల దేవీ ఉపాసనలు
తొమ్మిది రోజులు
దేవి వ్రతాలు.



-గుండం మోహన్ రెడ్డి

## విజయ పర్వం

దసరా అంటేనే సరదా
సెలవులకు ఇటువారటు అటువారిటు
ప్రయాణాల సందడి
పిల్లలకేనా సంబరం!
పెద్దలు కూడా
సగం వయస్సు తగ్గించుకునే పర్వమిది
పులివేషాలు వగైరాలు
కోలాహలంగా గడిపేకాలం
ఈ నవరాత్రులు
దసరా శరన్నవరాత్రులు.
ప్రతిఇంటా ఆడవారు
ముందు నుండే ప్రయత్నాలు
సరకుల చిట్టా తయారు
వంటిల్లు నింపే తాపత్రయాలు
బంధువుల ఆగమనం
మరెంతో ఆనందం
ఎవరింటవారు ఏపూటకాపూట
ఎంత తిన్నాం అనే తరహా జమానా తగదు
రాకపోకలావశ్యకం
సమయాభావమా
సరేసరి
అధమాతి అధమం
పండుగలకు పబ్బాలకైనా
గలగలా సంభాషణలు
ఆరగించే విందులు
కనబడే పంచభక్ష్య పరమాన్నాలే కాదు
కనబడని ఎంతో పరమార్థం దాగుంది
అన్ని తరాలవారు కలవడం
ఆటపాటలతో హోరెక్కే
అలవికాని ఆనందం
పెద్దలనుండి సాంప్రదాయ పద్ధతులు
చిన్నవారు
అవగాహన చేసుకునే ఈతరుణం
చిన్న సాయాలు పనులూ
అందరూ కలిసి చేసుకుని
పర్వదినమిది.



- ఉండవిల్లి సుజాతా మూర్తి

## విజయంలోనే ఆనందం

శ్రీ మాత ఎన్నో రూపాలు
రక్షణకవచం మానవులకు
రాక్షస సంహారం
విజయవిలాసం
ఎందరికో ఆనందం విజయదశమి.
బాల రూపం నుంచి
రాజ రాజేశ్వరి దేవి రూపం వరకు
ఎన్నో అవతారాలు
దుష్ట సంహారం
జన సంరక్షణం.
తొమ్మిది రోజుల పూజలు
పదవ రోజు విజయపర్వం
పిండివంటలు
కొత్త బట్టలు
బొమ్మల కొలువులు
శమీ పూజలు
ఆట పాటల ఆనందం
ఈ విజయం.



– నారుమంచి వాణీ ప్రభాకరి

## దశహర

మనసు భక్తి భావపూరితం
ఆధ్యాత్మిక ప్రార్థనం
శక్తి ఆరాధనం
అమ్మ పండుగ.
నవరాత్రులు సాగిన సమరం
నేలకొరిగిన మహిషాసురునితో
నలుదిక్కుల సాగిన
జగన్మాత విజయరేఖలు
రెక్కలు తొడిగిన సంబరాలు
ఆకాశ మార్గాన
అవని అంతా విస్తారం
అపరాజితయై విరాజిల్లుతూ
పదవ నాడు కొలువుకెక్కిన పర్వదినం.
దశ పాపాలను హరించిన
నవ దుర్గా దర్శనం
అజ్ఞాన తిమిర సంహారమే కాగా
రాక్షస సంహారిణియై
అంగరంగ వైభవంగా
ఆనంద సాగరియై సాగుతుంటే
విజయ దశమిగా
నవ శబ్దం నవ అహోరాత్రులుగా
ధార్మిక గ్రంథం తెలిపే
నూతన జ్ఞానప్రసాదిత దినం.
ముల్లోకాలు యేలే
ముగురమ్మలు ఏకమైన వేళ
ముచ్చటైన తీరే
ముక్తిప్రదాయమే ముజ్జగమంతా.
త్రిమూర్తుల తేజస్సున
ఉదయించిన కాత్యాయనే
శుభంకరిగా మహాగౌరీగా..
ధవళకాంతుల మాత
సిద్ధి ధాత్రియైన మంగళమూర్తి
సింహవాహినిగా శక్తిమాత
పూజలందుకుని..
విజయ కాలాన
సీమోల్లంఘనం చేసిన రోజు.
నాడు శమీ పూజతో
అర్జునుడు ధనుర్ధారి కాగా
రామునికి ప్రియాన్ని కలిగించి
శత్రునాశనం జరిగిన రోజు
మంచి సాధించిన గెలుపుతో
విజయానికి గుర్తుగా
నేటికీ ఆత్మీయతల నడుమ
పంచుకునే జమ్మి పత్రాలే
సాక్ష్యంగా నిలువగా
కొత్త విద్యలకు అనువై
లక్ష్మీ కటాక్షంతో
సువర్ణ వర్షం కురిపించి
ధనవృద్ధి కలిగించే రోజే
దశహర.



- శ్రీలత రమేశ్ గోస్కుల

## నవరాత్రులు

శ్రీమాత శ్రీకరి
శ్రీ జనని శివాయని
ఎన్నో రూపాలై
రాక్షస సంహారం చేసి
రక్షణజేసిన ఆదిశక్తి రూపమై
నిలిచి ఆనంద దాయకమై
సంతోషాలు కలిగించే తల్లి.
బాలత్రిపుర సుందరి రూపము దాల్చి
అఖిలాండేశ్వరి ఆనంద దాయిని
సకల రూపు తనలో నిలిపిన
సర్వజగతి సుందరివై
నిలిచిన నీ మహిమలు.
దేవినామస్తోత్రమాల నిరంజని
దివ్య జ్యోతిలా రాజీవ రమణి
సర్వ సృష్టి లో నీ రూపము
సత్యమై నిలిచె రాజరాజేశ్వరి
దేవివై నిత్య పూజలతో
వెలుగుతున్న నవరాత్రి.
దసరా రోజుతో ఆ దివ్య తేజస్సు
జగతిలో ప్రసన్నమై నిలిచిపోయె.



- వి.సంధ్యారాణి

## పాలపిట్ట

చెడుపై మంచి విజయం సాధించిన రోజు
పార్థుడు జమ్మిచెట్టును పూజించిన రోజు
పాలపిట్ట నీలాకశంలో
నీలంచు రెక్కల్లో మల్లెమాలై
దర్శనమిచ్చే రోజు
అదే విజయదశమి
శుభాకాంక్షలు చెప్పుకునే చెలిమి
పదితలలు తెగిన రావణుడు
బ్రహ్మ జ్ఞాని అపర శివ భక్తుడు
ఒక్క తప్పుతో ఇతిహాసాన రాక్షసుడు
వేల తలల చెడు నడకలు
భూమాత కు భారమౌతున్న నరుడు
నడత ఏనాడు మార్చుకునునో!.
కనురెప్ప పాటు కాలంలో
మనస్సాక్షినే మోసం చేస్తూ
ఎన్ని అసహజ వేషాలో.
నాలుకలు అబద్ధాలను చెప్పలేక
చీలిపోతున్నా చిచ్చుపెడుతున్నడు
అశాంతికి ఆజ్యం పోస్తున్నడు.
పక్షినీ పంచభూతాలను చెఱబట్టి
జీవజాలాలను ప్రకృతి వనరులను
గంపగుత్తగా కొల్లగొడుతున్నడు.
అక్రమాస్తులు కూడబెడుతూ
హింసోన్మాదంతో సామాన్యులను
చెరబట్టే రాబందుల రెక్కలు తెగితేనే
నిజమైన విజయ దశమి
ఆనాడే పాలపిట్ట కువకువలతో నవ్వులు.



- ఏడెల్లి రాములు

## దేవీ శరన్నవరాత్రులు

ఆశ్వియుజ మాస
శుద్ధ పాడ్యమి మొదలు
ఆశ్వియుజ నవమి వరకు
తొమ్మిది రోజులు
మహాశక్తి స్వరూపిణి ఆరాధనం
తొమ్మిది రోజులు తొమ్మిది రూపాలంకారాలు
ఈ తొమ్మిది రోజుల పర్వదినాలే
దేవీ శరన్నవరాత్రులు
ఏకభుక్త దీక్షలు
దర్శిస్తే ఈ రూపాలంకారాలు
లభించును భక్తులకు
అనంత కోటి పుణ్య ఫలాలు
నవదుర్గల ఆరాధనం
తెచ్చు ధనధాన్య సౌభాగ్యాలు.
మూర్తులు వేరైనా మూలపుటమ్మ ఒకరే
అలంకారాలు వేరైనా అమ్మ దయ ఒకటే
వినిపించు లలితా సహస్ర నామం ప్రతి ఇంట
పదవ రోజు దశమియే విజయదశమన్న మాట
దసరా దశహర అన్న పదం నుండి వచ్చెనట
దశహర అంటే
పది పాపాలు హరించే పదమట
దేవీ శరన్నవరాత్రి ఆరాధనా వైభోగం
సర్వశుభకరం
పెంచు సామరస్యం.



- జె.వి.కుమార్ చేపూరి

## విజయ దశమి ప్రబోధం

మంచితనం పరిఢవిల్లగ
అవనిపై చెడును దునుమాడ
ఈ నేలన మానవత్వం
దానవ గుణం చెడు నిష్క్రమణం
నేడు విజయోత్సవం
విజయ దశమిగా
ఆశ్వీయుజ శుద్ధదశమి!.
సకల సద్గుణ కళాభిరాముడు ఆదర్శనీయుడు
మానవీయతను పాదుకొల్పె ఇలపై
దశ కందర రావణ సంహార రక్తితో
ధర్మయుద్ధ విజయం విజయదశమి!.
అవినీతి పంపె పాండవుల్ని అరణ్యానికి
అజ్ఞాతవాసానికై ఆయుధాలు శమీవృక్షంపై
శమీశమయతే పాపవినాశనమంటూ
గాంఢీవధారి పాల్గొనె ఉత్తర గోగ్రహణాన
విజయునికి విజయోత్సవం విజయదశమి!.
రాక్షసశక్తిగా
దేవతల గడగడలాడించ మహీషుడు
దేవతా శక్తిసమాహారం
ప్రాణశక్తి పరాశక్తి
వరగర్వి మహీష సంహారమే దసరా
ముగురమ్మల సేవయే నవరాత్రులు
ముగురమ్మలు బతుకునిచ్చే బతుకమ్మగా
ప్రకృతి పరవశం దేవతల సేవలో!.
పాలపిట్ట శుభ సూచకం
శమీ వృక్షం
సంపదలకు ఆదిగా పూజనీయం
ఆయుధ పనిముట్ల పూజ సకలసంపదలు
మానవులంతా చూపిన లెక్కలు శమీవృక్షానికి
ఆదాయం తక్కువ ఖర్చులు ఎక్కువ
నిజానికేవె? ఖర్చులు తక్కువ ఆదాయమెక్కువ
అరకొర లెక్క జూపడం అదో ఆనందం!.
విజయదశమి నేడందరి ముదం
కరోనా కష్టకాలం పైన విజయం నేడు
నిన్నటి సమస్యలకు వ్యథతో కృంగిపోకు
నేటి విజయానికి పొంగి పోకు
ఒపటికి సమస్య లేదంటే పొరపాటు
సమస్యలపై నీ గాండీవాన్ని సంధించు
సతతం విజయంతో ముందుకు సాగిపో!.



-లక్ష్మారెడ్డి పసుల

# ఆదిలాబాద్ జిల్లాలో బొడ్డెమ్మ పండగ

తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా సంస్కృతి విభిన్న మైనది. కొత్తగా ఏర్పడ్డ ఆదిలాబాద్ జిల్లాకు మూడు వైపుల మహారాష్ట్ర వుండి గిరిజనులు తో, ప్రకృతి సంపదతో అలరారుతున్నది. ఈ జిల్లాలో పరిశ్రమలు, ప్రాజెక్టులు అంతంత మాత్రమే ఉండడం చేత ఎక్కువ శాతం పల్లెటూళ్లలో జీవిస్తారు. వర్షాధార పంటలనే పండిస్తారు. అందువల్లనే ఆదిలాబాద్ జిల్లా భాషా సంస్కృతులు ఇంకా సజీవంగానే వున్నాయి.

ఇక్కడి ప్రజలు ముఖ్యంగా వ్యవసాయ సంబంధమైన పండగలైన పోలాల (ఎడ్ల పండుగ) పండగ, సంక్రాంతి, పాడి బర్రెల్ని పూజించే సట్టి పండగ మొదలగువాటిని ఘనంగా జరుపుకుంటారు. ఇవన్నీ రైతు ప్రకృతికి కృతజ్ఞతా పూర్వకంగా చేసుకునే పండుగలు. ఇటు వంటి పండుగనే 'బతుకమ్మ' పండుగ ఒకటి.

తెలంగాణ లోని మిగితా ప్రాంతాలలో బతుకమ్మ పండగంటే ఆదిలాబాద్ జిల్లాలోమాత్రం బొడ్డెమ్మ పండగంటారు. కొన్ని ప్రాంతాల్లో పెత్ర అమావాస్యకు ముందు వారం రోజుల నుంచి పుట్టమన్నుతో ఆలయ శిఖరం లాగా కట్టిన బొడ్డెమ్మ ను చేసి పండగ జరుపుకుంటే ఆదిలాబాద్ లో మాత్రం మట్టితో కాకుండా పూల బతుకమ్మనే చేస్తారు.

పెత్ర అమావాస్య రోజున పూల బొడ్డెమ్మ పండుగ ప్రారంభమవుతుంది.

ఈ బొడ్డెమ్మ పండగను ఆదిలాబాద్ పెన్ గంగా తీర ప్రాంతం లోని మహారాష్ట్ర గ్రామాలు కూడా వైభవంగా జరుపుకుంటాయి. గిరిజనులు ఈ పండగకు దూరంగా వుంటారు.

**పండగ మొదటిరోజు:--**మహిళలు ఉదయాన్నే లేచి తల స్నానం చేసి పండగ సామాగ్రినంతా సిద్ధం చేసుకుంటారు. ఆటలాడుకోవడానికి విశాలమైన వాకిలి వున్న యింటి ముందు మోకాలు మంటి బాయి (బావి) తవ్వుతారు. ఈ గోతి చుట్టూ జానెడు ఎత్తు, జానెడు వెడల్పుతో చుట్టూ వోడ కడతారు. ఆ వోడ చుట్టూ ఆ వాడ ఇండ్ల సంఖ్య ను బట్టి గద్దెలేస్తారు. ఈ గద్దెలు దాదాపు కమలం పువ్వు ఆకారాన్ని పోలి ఉంటాయి. ఈ గద్దెలను ఆనుకొని పిల్లలకు పిల్లగద్దెలు వేస్తారు. మట్టితో అలికి ముగ్గులేసి ఆడవాళ్లంతా చప్పట్లు వేస్తూ

ఎలవద్రి చెట్టుకూ కోలు ఏడే మొగ్గాలే కోలు
అనే పాట పాడుతూ ఊరు బయటవున్న

'ఎలవద్రి 'చెట్టు తెచ్చి బాయి ఓడపై నాటుతారు. ఆ రోజు నుంచి ప్రతి మహిళ పడుచు పిల్లల తలపులలో బొడ్డెమ్మపాటలు,ముచ్చట్లు ఆనందంతో ఉప్పొంగుతాయి.

తంగేడుపువ్వు దొరకని గ్రామాల్లో గుమ్మడి పువ్వునే పవిత్రంగా భావించి బొడ్డెమ్మపై ఉంచుతారు.

చేనుపనికి వెళ్లిన స్త్రీలు పైరుకు చెమటపాలు పోస్తూనే ఇటు పాటకుపురుడు పోస్తారు. ఈ విధంగా శ్రామిక తల్లులు సాయంత్రం బొడ్డెమ్మదగ్గర 'బొడ్డెమ్మ బొడ్డెమ్మా కోలు నీ బిడ్డే దొరసాని కోలు 'అనుకుంటూ పాటలు పాడుతూ ఆటలాడుతారు. సాయంత్రం కన్నె పిల్లలు దడుల పొంట పూలు తెంపుకొస్తరు. తల్లులు చేను నుంచి ఒడిలో పండ్లు, కాయలతో పాటుగునుగు, గుల్వాయి, కట్లపూలు తెస్తారు. ఆడ పిల్లలు వాటితో సికిరెంతలపై బొడ్డెమ్మ పూదిచ్చి తపుకులో బాయి దగ్గరికి తీసుకెళ్తారు.

**పాటల పండుగ :---**ఆదిలాబాద్ ప్రాంతంలో



బొడ్డెమ్మపాటలు ఎంతో ప్రత్యేకమైనవి. కోలు పాటలు, ఉయ్యాలో, ఎలసందమామ గౌరమ్మ, ఎన్నియాలో అనే పల్లవులు లేని పాటలుండవు. మొదటిరోజు ఎలవద్రి సెట్టుకు మొదలుకొని చివరిరోజు ఉసికెల వుట్టే గౌరమ్మా, వుసికెలా కలిసే గౌరమ్మా 'అనే పాట దాకా పాటలపై పండగ సాగిపోతూనే ఉంటుంది.'రామ రామ రామ ఉయ్యాలో రామనే శ్రీరామ ఉయ్యాలో, పిలని గొయ్యా వట్టుకోని ఎల సందా మామా /సిక్కలేమో జల్లుమనే ఎలసందా మామా, శ్రీలక్మి నీ మహిమలూ గౌరమ్మా చిత్రమై తోచునమ్మ గౌరమ్మా, బంతిపువ్వాలు దేచ్చి బొడ్డెమ్మను పూదించి ఆడుదాము వదినా మన నోములాడి బతుకమ్మ లాంటి వందలాది పాటలు వూళ్ళను పాటల పల్లకిలలో ఊరేగిస్తాయి.తల్లి పాడుతుంటే తొడపైన పడుకున్న ఎడవిల్లలు నిద్రలోనే పాటలు చప్పరిస్తూ ముందుతరానికి వారసులౌతారు.

**పుట్టింటి బిడ్డల పసందైన పండగ:-**బొడ్డెమ్మ పండగంటే ఆదిలాబాద్ ప్రాంతంలోపుట్టింటి బిడ్డల పండగే?కొత్తగా పెళ్ళైన ఆడపిల్లలు నాలుగు రోజులుండైనా పండుగచేసి వెళ్తారు.చిన్నప్పటి స్నేహితులు, చుట్టాలు, బంధువులతో కులాసాగా గడిపి పోతారు. కష్టాలు కన్నీళ్లు కూడా ఇక్కడే సేదతీరుతాయి.

**నెల రోజుల సరదా పండుగ :----**ఎక్కడా లేని విధంగా ఆదిలాబాద్ ప్రాంతంలో దాదాపు నెల రోజులు ఆడ పిల్లలు బొడ్డెమ్మ ఆడుతుంటారు. పెళ్లికాని ఆడపిల్లలు ఆటలాడుకోడానికే ఈ నెల రోజుల ప్రత్యేకత. కానీ మిగితా తెలంగాణ ప్రాంత మంతా దసరాకంటే ముందే నిమజ్జనమవుతాయి. ఇక్కడ ఈ నెలరోజులు పిల్లలు కోలాటం, చప్పట్లు, దాగుడు మూతలు, డీలమ్మా డీలు,ఎన్నిలకుప్పలు మొదలగు అట్లాడుతూ పాటలు పాడుతూ పండగని సంబరాల్లో ముంచేత్తుతారు.

**చిన్నసద్దులబొడ్డెమ్మ:**పండుగ మొదలయిన్నుంచి ప్రతిరోజూ శక్కరి అటుకులు, పల్లీల పొడి బెల్లం, నువ్వుల పొడి బెల్లం, మినుప, పెసరి పప్పుల పొడుల తో చేసిన వాయినాలన్నీ కలిపి ప్రసాదంగా స్వీకరిస్తారు.ఈ చిన్న సద్దుల రోజు (దసరాపండుగ రోజు నే చిన్న సద్దుల రోజు అంటారు) మాత్రం రోజు కంటే ప్రత్యేకంగా పెరుగన్నం సద్దితెచ్చిఅక్కడే తిని వస్తారు.ఆ రోజు బొడ్డెమ్మలను రోజటి కంటే కొంచెం పెద్దగా రంగు రంగుల పూలతో ఆకర్షణీయంగా అలంకరిస్తారు.

ఆడ పడుచులు కూడా ఉన్నదాంట్లో కొంచెం అందంగా ముస్తాబయి వస్తారు. ఎన్నడూ ఆడిపాడని వాళ్ళు,సిటి నుంచి వచ్చినవాళ్లుసైతం ఆటపాటల్లో మునిగిపోతారు.

**అన్నా చెల్లెళ్ళ పండుగ :-----**ఆదిలాబాద్ బోథ్, ఉట్నూరు దాకా రాఖీ పండుగ కంటే ఎన్నో ఏళ్ల ముందునుంచే ఈ బొడ్డెమ్మల పండుగ అన్నా చెల్లెళ్ళ పండుగలా ప్రసిద్ధి పొందింది. పూర్వకాలం ఒక రాజుకు ఏడుగురు కొడుకులు ఒక్కతే ఆడబిడ్డ ఉంటుంది. ఒకరోజు పూల కోసం చెరువు కెళ్ళి ప్రమాదం జరిగి దాంట్లోనే మునిగి పోతుంది. అప్పటి నుంచి చెల్లెలు జ్ఞాపకార్థంగా అన్నలు ఈ పండుగను చేసుకుంటారని పురాణ కథ ప్రచారంలో వున్నది. ఏది ఏమైనా ఎంత బీద అన్నదమ్ములైనా తోడ బుట్టిన అక్కా చెల్లెలుకు బొడ్డెమ్మని మజ్జనం రోజు కలిగినంత లో చీర,సారెకట్నం బెట్టి సాదరంగా సాగనంపుతారు.

అదేవిధంగా బొడ్డెమ్మను గౌరీదేవిగా, గుమ్మడి పువ్వును గౌరమ్మ పువ్వుగా ఇక్కడి పల్లె ప్రజలు భావిస్తారు.

నిమజ్జనానికి ఒక రోజు ముందు బొడ్డెమ్మకు సెలవు. నిద్రలు పోతాయంటారు.నిమజ్జనానికి ఏర్పాట్ల కోసం సెలవు అనికూడా అంటారు.

**నిమజ్జనం రోజు :**ఈ రోజు యింటి వాళ్లంతా ఎవరి పనుల్లో వాళ్ళు లీనమై పోతారు. ఆడవారు వంటలు మొదలు పెడితే, మగవారు చెరువు వాగులోకి వెళ్లి కలువపూలు, కట్ల పూలు, గునుగుపూలు, గుమ్మడిపూలు బంతిపూలు తెచ్చిస్తారు. పేదతల్లులు కూలీలు సైతం చివరిదినం సంబరాలకు నెల రోజుల నుంచి దినం దినం రూపాయి రూపాయి జతనం చేసి తనకు లేకున్నా పిల్లలకు కొత్త బట్టలు, పుట్టింటి బిడ్డెకు కనుదుప్పటి సమకూర్చు కుంటారు. ఆ రోజు నువ్వుల బూరెలు, పల్లీల బూరెలు షెనగ, కంది పప్పు బూరెలు,అరిసెలు, గుమ్మడి పండు బజ్జీలు ఎంతో ఇష్టంగా చేసుకుంటారు.

సాయంత్రం ఐదు గంటలకు పెద్ద కోపెరలో గాని తాంబూలంలో గాని బొడ్డెమ్మను పూలతో పూదిస్తారు. తంగేడుపువ్వు దొరకని వారు గుమ్మడిపువ్వును బొడ్డెమ్మ తలపై పెట్టి దానిపై పసుపుతో గౌరమ్మ చేసి పూజించి ఇంటినుంచి తీసుకెళ్తారు. ఆడవారు , పిల్లలు ఆ రోజు వున్న దాంట్లోనే కొంచెం ప్రత్యేకంగా తయారవుతారు. బొడ్డెమ్మల దగ్గర అమ్మలక్కలంతా చేరి బొడ్డెమ్మ (బాయి) చుట్టూ చెప్పట్లేసుకుంటూ,పాటలు పాడుకుంటూ ఊరేగింపుగా చెరువు దగ్గరికో వాగు దగ్గరికో తీసుకెళ్తారు. ఇక్కడ మాత్రం కులాల హెచ్చు తగ్గులు స్పష్టంగా కనబడ్తయి.

మగవారు సద్దిగుల్లల్ని తలపై, పిల్లల్ని భుజాలపై ఎత్తుకొని ఊరేగింపు వెనుకవెళ్తారు.ఊరు ఊరంతా వెలుగులతో పూలజాతరలా కనిపిస్తుంది.

చెరువులో బొడ్డెమ్మల్ని వదిలేసి అక్కడే సద్దులు తిని చెరువు నుంచి తెచ్చిన ఉసికెను బయిలో వేసి 'ఉసికెలో పుట్టిన గౌరమ్మా, ఉసికెలో కలిసే గౌరమ్మా 'అనిపాట పాడుతూ బావిని పూడ్చేస్తారు.

ప్రకృతికి దగ్గరగా జీవిస్తున్న వారు ప్రపంచములో ఎక్కడా లేని పూలను పూజించే అపురూప పండుగ ఇది.

కాలం మారినా అభిరుచులు మారినా ఎన్ని డీ.జే లు మారుమ్రోగినా పల్లె జనం మనస్సులో పనిపాటతో పెనవిసుకున్న పండగలని ఎవ్వరూ విడదీయలేరు.వాడ బతుకమ్మలు పోయి బహుజన బొడ్డెమ్మలు వెలిసి ఊరంతా ఒకటే బతుకమ్మయితే ఆ తల్లుల ఆనందం చెప్పనలవి కాదు. కబ్జా కోరల్లో చిక్కుకుంటున్న చెరువుల్ని, వాగులను, కుంటలను, గుట్టలను ప్రభుత్వం కాపాడితే తెలంగాణాలో బతుకమ్మ (బొడ్డెమ్మ) పండుగ చిరకాలం బతుకుతుంది.



-డా. ఉదారి నారాయణ,
9441413666.

# మానవ సంబంధాల పండుగ బతుకమ్మ





సభలో ప్రసంగిస్తున్న డా॥ నందిని సిధారెడ్డి.

మానవ సంబంధాలను ఎంతో ఉదాత్తంగా తరతరాలకు తెలియజేసే గొప్ప పండగ బతుకమ్మ పండగ అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షులు ప్రఖ్యాత కవి డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. అక్టోబర్ 10 నాడు మెదక్ కేంద్రంలో తెలంగాణ రచయితల సంఘం, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో తెరసం మెదక్ జిల్లా అధ్యక్షురాలు ఎం. కవిత అధ్యక్షతన నిర్వహించిన కవి సమ్మేళనం మరియు బతుకమ్మ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉద్యమకాలంలో బతుకమ్మ ప్రజలను ఏక తాటిపై నడిపించిందని, సంగీత, సాహిత్య, నాట్య కళల సమాహారంగా పల్లెలు వేదికగా పల్లె ప్రజలు ఆధారంగా తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీకగా నిలిచిందన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకాలంలో మీడియాలో ఆదరణ లేని సమయంలో జాగృతి అధ్యక్షురాలు కవిత ఎంతో శ్రమించి దేశవిదేశాలలో బతుకమ్మ బాటలో తెలంగాణ ఉద్యమాన్ని సాంస్కృతిక దిశలో నడిపించిందన్నారు. బతుకమ్మ పాటలలో సాహిత్యం అచ్చమైన తెలంగాణ భాషలో ఆకర్షణీయంగా మనసుకు హత్తుకునే విధంగా ఉందన్నారు. అనేక రహస్యాలు చక్కని పురాణ కథలు గొప్ప ఊహలతో పాటలు ఉత్తేజితుల్ని చేస్తాయన్నారు. తాను రాసిన నాగేటి సాల్లల్ల పాటలో బతుకమ్మ గురించి రాసిన చరణం తంగేడు పూవుల్లు తంబాలమంతాతీరొక్క రంగుల్లో తీరిచ్చినా పువ్వుబంగారు చీరలు బాజారులన్నీబతుకమ్మ పండుగ నా తెలంగాణ నా తెలంగాణబంతి పువ్వుల తోట నా తెలంగాణ నా తెలంగాణ అందరి నాలుకలపై నడయాడిందన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం పురాణాలలో ఉన్న బతుకమ్మ ప్రాశస్త్యాన్ని వివరించారు. కాకతీయుల కాలంలో బతుకమ్మ ఎలా ప్రారంభమైందో తెలియజెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతితో పాటు, ప్రకృతిని ప్రేమించడం, బతుకమ్మ పేర్చడంలో ఉపయోగించే పూలల్లో తీగలలో ఉండే ఔషధ రహస్యాలను తెలియ చెప్పడం బతుకమ్మ పండగ అంతరార్థమన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుండి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రజలు గర్వించే రీతిలో ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం మెదక్ కార్యదర్శి దేశపతి కృష్ణ, అంజా గౌడ్, రమ్య, అంజలి, లావణ్య, సాయిశ్రీ ఇక్బాల్, వెంకటేశ్, మోహన్ రెడ్డి, బిక్షపతి, రావుల సుధాకర్, దుర్గా రాములు, జయప్రద, రాజేశ్వర్ , నవీన్, రాజశేఖరు, ఎస్. నవీన్, మురళి, మల్లేశం, రవి, కృష్ణ, మిట్టపల్లి సవిత, శ్రీనివాస్, దిగంబర్ ఖదీర్పాషా తదితరులు కవితా గానం చేసి అలరించారు. అనంతరం కవయిత్రులు బతుకమ్మ ఆడి పాడగా అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.

## ధరణి దాహం

ఒళ్ళు విరిచి ఒడిసి పడతది నేలతల్లి
దాహం అన్నది తీర్చుకుంటుంది
పోత్తికడుపులో దాచుకుంటుంది
దాచుకున్నదీ దోచుకున్నది
పుడమి ఆకలి తీర్చనంటాం
చెట్టు పుట్టలు నరుకుతుంటాం
మిద్ద మేడలు కడుతువుంటాం
ధరణి ఒళ్లను ఒలిచి తింటాం
ధరలు పెంచి అమ్ముకుంటాం
దారుణాలకు దారులేస్తాం
ఘోరాలకు పూనాదులేస్తాం
గొప్ప బతుకు గొప్ప బతుకని
గొప్పలెన్నో చెప్పుకుంటాం
కర్ణుడి చావుకి నేలతల్లి
ఒక కారణం అన్న విషయం మరిచిపోతాం
ప్రకృతి గోడలు కూల్చివేస్తాం
తల్లి ఒడిలో సేద తిరుదాం
దీనమైన నేలతల్లి కి
దాహం ఒకటి మిగిలి ఉంది
తీర్చమని కొంగుపట్టి అడుగుతున్నది
ఇప్పటికైనా మేలుకుందాం
ధరణి దాహం తీర్చి వేద్దాం..



-రమావత్ విష్ణువర్ధన్
7036890195.

## కణిక



అడ్మిన్: రమాదేవి కులకర్ణి

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు



ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ప్రథమ బహుమతి విజేత

### నిశ్శబ్ద ప్రతిధ్వని

ఆధునికపు ఆకాశంలో
కాలుష్యపు కారుమబ్బులు
కరాళ ధ్వనులు చేస్తున్న వేళ..
ఋతువులు క్రతువులుగా మారి..
సృష్టిస్తున్న నిశ్శబ్దప్రతిధ్వనిలో
విశ్వం అయోమయంలో
మునుగుతున్నది.....!!!.
పలురకాల సూక్ష్మ రోగాలు
చడి చప్పుడు లేకుండా
చాపక్రింద నీరులా పాకి..
కాలనాగులై జనారణ్యాలను
కాటేస్తూ హాహాకారాల హారాలై
ప్రజల గుండెచప్పుళ్ళకు
తాళం వేస్తున్నాయి...!!!.
దానికితోడు..
అనాగరికపు అలవాట్లు
విచ్చలవిడి విహారాలు
మాదకద్రవ్యాల మసాలాలు
విలాసాల మబ్బులై..
యువ జీవితాలను మత్తులో
గమ్మత్తుగా చిత్తు చేస్తూ..
అరాచకాలను చేయిస్తున్నాయి...!!
ఇకనైనా మేల్కొందాం
మత్తును వదిలించుకుని..
సంస్కారపు విలువలతో
తాపడం పట్టుకుందాం..
ఆరోగ్యాన్ని నిశ్శబ్దప్రతిధ్వనికి..
ఆహుతి కాకుండా..
కాపాడుకొనేందుకు
కంకణ బద్ధులవుదాం..!!!



-సావిత్రి రంజోల్కర్
9833497812

ద్వితీయ బహుమతి విజేత

### తీపి గుళికలు

ఇతరుల చెప్పుడు మాటలు తీయటి మందు గుళికల్లై, మనసును తొలి చేస్తుంటాయి చెదపురుగుల్లై... మందర మాటలు విని రాముని అడవుల పాలు చేసి, దశరథుడి మరణానికి కారణమై, చరిత్ర హీనురాలిగా కైక మిగిలింది...

అలాంటి మందరలు మన చుట్టూ ప్రదక్షిణ చేస్తూ మన మనసును పని చేసి మన మనసులోకి చాపకింద నీరులా దూరి మనసును బద్దలు చేస్తుంటాయి...

మన హృదయం లావాలా పేలిపోతుంది... అశాంతితో రగిలిపోతూ అసంతృప్తితో బతకాల్సి వస్తుంది... ఇతరుల మాటలు విని, వదిలేస్తే శాంతి మీ మనసులో తిష్ట వేస్తుంది...

మంచో,చెడో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుని చెప్పుడు మాటలు మనసు ఆవరణలోకి చేసుకోకండి...

అది మనసులో కైనా దేశానికైనా...

మన ఇంటి ముంగిట్లో కైనా... చేర్చుకున్నామో మనకే అది అరిష్టం...

పంట పొలాలను చీడపీడలు నాశనం చేసినట్టు, ఇతరుల చెప్పుడు మాటలు మనల్ని..

మన కుటుంబాన్ని... మన మనసును చీడపీడలై ఎదగనీయకుండా చేస్తాయి చాప కింద నీరులా.



-కొంజేటి రాధిక
9493273114

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.